విశాలాంధ్ర

కృష్ణా, ఎన్టీఆర్
గుంటూరు, పల్నాడు

సోమవారం 03 మార్చి 2025 8 పేజీలు

కౌలురైతు కుటుంబాన్ని ఆదుకోవాలి

రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి... కౌలు రైతు సంఘం డిమాండ్

విశాలాంధ్ర నందిగామ:- వ్యవసాయ అప్పులతో ఆత్మహత్య చేసుకున్న కౌలురైతు ఇనుకొల్లు నరసింహారావు కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జమలయ్య, రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్నీడి యల్లమందారావు, ఎన్టీఆర్ జిల్లా రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చుండూరు సుబ్బారావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇనుకొల్లు నరసింహారావు కుటుంబాన్ని ఆదివారం రైతు సంఘం నాయకులు పరామర్శించారు. అప్పులన్నీ మాఫీచేసి ఆ కుటుంబానికి అండగా నిలబడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. మూడు రోజుల క్రితం నందిగామ నియోజకవర్గంలోని చందర్లపాడు మండలం, కోనయపాలెం గ్రామానికి చెందిన ఇనుకోల్లు నరసింహారావు కౌలుకు భూములు తీసుకొని పత్తి, మిర్చి పంటలు పండిస్తున్నాడు. గతంలో పల్నాడు జిల్లా అచ్చంపేట మండలంలోని చల్లగరిగలో 5 ఎకరాలు కౌలుకు తీసుకొని సాగు చేశాడు. అక్కడ కౌలు రేట్లు పెరగడంతో కొనయపాలెంలో ఎకరం రూ.35 వేల నుంచి రూ. 40 వేలకు వరకు కౌలుకు తీసుకొని ఐదు ఎకరాలలో మిర్చి, పత్తి పండిస్తున్నాడు. పంట సరిగ్గా పండగ, దిగుబడి రాక అప్పుల్లో కూరుకు పోయాడు. సాగుకోసం చేసిన అప్పులు తీర్చడానికి చల్లగరిగ మరియు కోనాయపాలెంలోని తనకున్న రెండు ఇళ్ళను స్థానిక బ్యాంకుల్లో తాకట్టుపెట్టి అప్పు తీసుకున్నాడు. అయినా అప్పులు తీరలేదు. దీంతో అప్పులు వాళ్ళ వేధింపులు తట్టుకోలేక ఆత్మస్థైర్యం కోల్పోయి పురుగుల మందులు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్య చేసుకున్న నరసింహారావుకు భార్య, కుమార్తె కుమారుడు ఉన్నారు. ఇద్దరు తల్లిదండ్రులు ఉన్నారు.

వారితోపాటు పెళ్లిలైన అక్కల భారం కూడా ఈ నరసరావు మీద పడింది. ఇంటి యజమాని చనిపోవడంతో ఆ కుటుంబం వీధిన పడింది. తక్షణమే ప్రభుత్వం నరసింహారావు కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో ఆత్మహత్యలు చేసుకున్న మిగతా 2 లో ...

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : సోమవారం సా॥ : 6:20
సహేరి : మంగళవారం ఉ॥ 5:07

ఏ తల్లి కన్నబిడ్డో?

- 12 రోజుల కిందట ఏటీటీపీఎస్ కాలువ సంప్‌లో బాలుడి మృతదేహం
- నేటికీ లభించని వివరాలు

3

'ఎమ్మెల్సీ' ఫలితం నేడే

- గుంటూరులో గ్రాడియేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు చేసిన అధికారులు
- మొదటి ప్రాధాన్యత ఓటు విధానంతో లెక్కింపు
- 750 మంది... మూడు షిఫ్టులలో విధులు
- కౌంటింగ్ కేంద్రం వద్ద మూడంచెల భద్రత

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : ఉమ్మడి కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గం శాసనమండలి ఎన్నికల ఓట్ల కౌంటింగ్‌ను ఈ నెల 3వ తేదిన ఉదయం 8 గంటలకు ప్రారంభించనున్నారు. దీనికి అవసరమైన అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఫిబ్రవరి 27వ తేదిన ఉమ్మడి కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గం శాసనమండలి ఎన్నికల ఓటింగ్ జరిగిన విషయం విధితమే. ఈ ఎన్నికల్లో దాదాపు 69.5 శాతం పోలింగ్ జరిగింది. సుమారు 2.41 లక్షల మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్న విషయం తెలిసిందే. అయితే ఈ ఎన్నికలకు సంబంధించిన కౌంటింగ్ గుంటూరు ఏసీ కళాశాలలో సోమవారం నిర్వహించనున్నారు. ఓట్ల లెక్కింపు కోసం 750 మంది సిబ్బందికి డ్యూటీలు కేటాయించారు. వీరు మూడు షిఫ్టలలో విధులు నిర్వహిస్తారు. కౌంటింగ్ జరిగే ప్రదేశం మొత్తం మూడంచెల పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. ఏసీ కళాశాలలో ఉమ్మడి కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గం మిగతా 2 లో ...

దుర్గంధాన్ని నివారించండి

డంపింగ్‌యార్డ్‌ను తరలించాలని సింగ్‌నగర్ వాసుల వేడుకోలు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): సింగ్‌నగర్ డంపింగ్ యార్డ్ పేరుకుపోయిన చెత్తతో సింగ్ నగర్ ప్రాంతం దుర్గందానికి నిలయంగా మారిందని, వెంటనే డంపింగ్‌యార్డు మార్చాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఐ ఆధ్వర్యంలో సింగ్‌నగర్ ప్రాంతంలోని డంపింగ్ యార్డ్ ప్రాంతాన్ని సీపీఐ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీఐ నగర కార్యదర్శి జి. కోటేశ్వరరావు మాట్లాడుతూ గతంలో మిగతా 2 లో ...

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఏఐటీయూసీ గుంటూరు జిల్లా సహాయ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్

విశాలాంధ్ర-మంగళగిరి : రాష్ట్రంలోని మున్సిపాలిటీలో పనిచేస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు కనీస వేతనాన్ని అమలు చేయాలని, పర్మినెంట్ కాంట్రాక్ట్ కార్మికుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ గుంటూరు జిల్లా సహాయ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్ అన్నారు. ఆదివారం మంగళగిరి

పట్టణంలోని వేములపల్లి శ్రీకృష్ణ భవన్ ఏఐటీయూసీ కార్యాలయంలో మున్సిపల్ కార్మికుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏఐటీయూసీ గుంటూరు జిల్లా సహాయ కార్యదర్శి అన్నవర ప్రభాకర్ మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్న మున్సిపల్ కార్మికుల సమస్యలు సమస్యలుగానే మిగిలిపోతున్నాయని నగరాలను పట్టణాలను గ్రామాలను పరిశుభ్రంగా ఉంటే పారిశుద్ధ్య కార్మికుల సమస్యల పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని ఆయన విమర్శించారు. ఆప్కాస్ విధానాన్ని తొలగించి కార్మికులను కాంట్రాక్ట్ విధానంలోకి మార్చి కాంట్రాక్ట్ విధానాన్ని తీసుకురావడానికి ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని ఆయన మండిపడ్డారు. మున్సిపల్ కార్మికులకు ఉద్యోగులకు అప్కాస్ విధానంలోనే వేతనాలు ఇచ్చే విధానాన్ని మున్సిపాలిటీల ద్వారా అథారిటీగా చెల్లింపులు జరగాలని, కాంట్రాక్టు విధానాన్ని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని పర్మినెంట్ కార్మికులకు పెండింగ్లో ఉన్న డిఏలను మిగతా 2 లో ...

(మొదటి పేజీ తరువాయి)

కౌలురైతు కుటుంబాన్ని ఆదుకోవాలి

రైతు, కౌలురైతుల కుటుంబాలకు ప్రతి కుటుంబానికి రూ.10 లక్షల చొప్పున పరిహారం ఇచ్చే విధంగా నిధులు కేటాయించి ఆ కుటుంబాలను ఆదుకోవాలని, బాధిత కుటుంబాల పిల్లలకు ఉచిత విద్య సౌకర్యం కల్పించి అండగా నిలబడాలని ప్రభుత్వాన్ని కోరారు.

'ఎమ్మెల్సీ' ఫలితం నేడే

శాసనమండలి ఎన్నికలు కౌంటింగ్‌కు ఏర్పాట్లు చేసిన కౌంటింగ్ హాల్లో కౌంటింగ్ సిబ్బందికి నిర్వహించిన శిక్షణ కార్యక్రమం అనంతరం రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, సంయుక్త కలెక్టర్ ఏ.భార్గవ్ తేజతో కలిసి ఆదివారం మీడియాతో మాట్లాడారు. ఉమ్మడి కృష్ణా–గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గం శాసనమండలి ఎన్నికల ఓటింగ్ ఫిబ్రవరి 27వ తేదీన ముగిసిన అనంతరం అన్ని జిల్లాల బ్యాలెట్ బాక్సులు కౌంటింగ్ జరిగే ఏసీ కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్‌లోకి తరలించి భద్రపరచడం జరిగిందన్నారు. శాసనమండలి ఎన్నికలు పోలింగ్ దాదాపు 69.5 శాతం జరిగినందున దాదాపు 2.41 లక్షల ఓట్లు లెక్కించాల్సి ఉందన్నారు. బ్యాలెట్ పేపర్, మొదటి ప్రాధాన్యత ఓట్లు విధానంతో లెక్కింపు జరుగుతున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం నిర్దేశించిన ప్రక్రియ ప్రకారం కౌంటింగ్ సుమారు రెండు నుంచి మూడు రోజులు జరిగే అవకాశం ఉందన్నారు. ప్రాథమికంగా కౌంటింగ్ మొదటి రౌండ్‌లో పోలింగ్ బూత్‌ల వారీగా పోలైన ఓట్లను సరిచూసుకొని మిక్సింగ్ చేస్తారన్నారు. తదుపరి చెల్లుబాటయ్యే ఓట్లను వేరుపై చేసి మొదటి ప్రాధాన్యత ఓట్లను లెక్కించడం జరుగుతుందన్నారు. మొదటి ప్రాధాన్యత ఓట్లు లెక్కింపు పూర్తి అయ్యే సమయానికి నిర్దేశించిన కోటా ఓట్లు వచ్చిన అభ్యర్థిని గెలుపొందినట్టు ప్రకటించడం జరుగుతుందన్నారు. అభ్యర్థులు ఎవరికి నిర్దేశిత కోట ఓట్లు రాకపోతే ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలు ప్రకారం తక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థులను ఎలిమినేట్ చేస్తూ వారికి వచ్చిన తదుపరి ప్రాధాన్యత ఓట్లను ఇతర అభ్యర్థులకు పంచుతూ కౌంటింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఓట్లు లెక్కింపు కోసం మూడు షిఫ్టుల్లో విధులు నిర్వహించేలా 750 మంది సిబ్బందిని వివిధ డ్యూటీలు కేటాయించడం జరిగిందన్నారు. అభ్యర్థులు సైతం ఏజెంట్లను మూడు షిఫ్టుల్లో నియమించుకునేలా అవకాశం కల్పించామన్నారు. కౌంటింగ్ ప్రదేశం మొత్తం మూడంచెల పటిష్ట భద్రత ఏర్పాటు చేశామని, గుర్తింపు కార్డు లేకుండా ఎవర్నీ కౌంటింగ్ ప్రాంతానికి అనుమతించడం జరగదన్నారు. అదేవిధంగా కౌంటింగ్ హాల్‌లోకి సెల్ ఫోన్లు అనుమతించరని, పూర్తిస్థాయిలో తనిఖీ చేసిన తర్వాత మాత్రమే కౌంటింగ్ హాల్లోకి ఏజెంట్లను, కౌంటింగ్ సిబ్బందిని అనుమతించడం జరుగుతుందన్నారు. ఓట్లు లెక్కింపు సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియాకు తెలియజేసేలా ఏర్పాట్లు చేయడం జరిగిందని, వీటితో పాటు ఇతర అవసరమైన అన్ని ఏర్పాట్లను సిద్ధం చేయడం జరిగిందని చెప్పారు.

దుర్గంధాన్ని నివారించండి

ఇదే ఇబ్బందులు ఎదుర్కొన్న సింగ్ ప్రాంతవాసులు కోసం సీపీఐ పోరాటం చేసిందని గుర్తు చేశారు. ఆ పోరాటంలో కేసులు పెట్టిన లెక్కచేయకుండా సింగ్‌నగర్ ప్రాంతవాసుల కోసం నిలబడ్డారన్నారు. నాటి మున్సిపల్ కమిషనర్ దుర్గంధాన్ని నివారించి ఏ రోజు వచ్చిన చెత్తను ఆ రోజు తొలగించడం జరిగిందన్నారు. ఫలితంగా ప్రజలు ఇబ్బందులు తొలగి ఊపిరిపీల్చుకున్నారని తెలిపారు. గత 40 రోజులుగా చెత్త తరలింపు సక్రమంగా జరగకపోవడంతో, చెత్త పోరుకుపోయి దర్గంధం వ్యాపిస్తుందన్నారు. ఫలితంగా దోమలు పెరిగి ప్రజల పై దాడి చేస్తున్నాయని, రోగల బారిన పడుతున్నారని అన్నారు. చెత్త తరలింపు సక్రమంగా జరగకపోవడానికి తరలింపు చేసే వాహనాలు కొరత ఉండటం వలన చెత్త తరలింపు జరగడంలేదన్నారు. తక్షణమే ప్రజల ఇబ్బందులు తొలగించేందుకు నగర పాలక సంస్థ కమిషనర్, అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర సహాయ కార్యదర్శి నక్క వీరభద్రరావు, నగర కార్యదర్శివర్గ సభ్యులు కేవీ.భాస్కరరావు, కార్యవర్గ సభ్యులు లింగబత్తుల శివకుమార్, స్థానిక పార్టీ నాయకులు కంది ఆదినారాయణ, పాపారావు, లక్ష్మయ్య, టీ.బ్రహ్మజీ, సంపత్, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సరెండర్ లీవులకు వేతనాలు ఇవ్వాలని పెరిగిన జనాభా ప్రాతిపదికన మున్సిపాలిటీలకు కార్మికులను పెంచాలని అన్నవరపు ప్రభాకర్ డిమాండ్ చేశారు. మార్చి 3న కలెక్టర్ ఆఫీస్ వద్ద మార్చి 6న విజయవాడలో జరిగే ధర్నాలను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందం బ్రహ్మేశ్వరరావు, రాచకొండ శివ, హరిబాబు, మున్సిపల్, ఇంజనీరింగ్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

స్థలాన్ని కబ్జా చేశారు

విశాలాంధ్ర-విజయవాడ (లబ్బీపేట) : అజిత్‌సింగ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రామకృష్ణాపురంలో భూ కబ్జా బాహాటంగా జరుగుతుందని ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోవడంలేదని బాధిత కుటుంబ సభ్యులు వాపోయారు. రామకృష్ణాపురంలో కబ్జాకు గురైన స్థలం వద్ద బాధిత కుటుంబ సభ్యులు విలేకరుల సమావేశాన్ని నిర్వహించి కన్నీరు మున్నీరు అయ్యారు. స్థలానికి చెందిన దివ్యాంగ యువకుడు మస్తాన్‌వలీ మాట్లాడుతూ అనేక సంవత్సరాల నుండి తాము నివాసం ఉంటున్న స్థలాన్ని మాది అని కొందరు ఆక్రమించుకున్నారని వాపోయాడు. అదేమని ప్రశ్నించిన తన పైన, తన తల్లి పైన, కుటుంబ సభ్యుల పైన దాడి చేశారని ఆవేదన వ్యక్తం చేశాడు. గత నెల 27వ తేదీన స్థలాన్ని ఆక్రమించి ఆ స్థలంలో రౌడీలను ఉంచి ప్రశ్నించిన తమపై దాడి చేశారని, కళ్ళల్లో కారం కొట్టి తాము నివసిస్తున్న ఇంటి నుంచి బలవంతంగా బయటకు తరిమేసి ఇబ్బంది పెట్టారన్నారు. తమకు గూడు కూడా కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటిలో ఉన్న సుమారు పది లక్షల రూపాయలు విలువ చేసే సామాగ్రిని రౌడీలతో బయటకు పడేసారని ఆరోపించారు. తమపై దాడిని పోలీసులకు చెప్పినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ఏసీపీ స్థాయి అధికారి సైతం కబ్జాదారుడివైపే మాట్లాడుతున్నారని తెలిపాడు. 20 రోజుల క్రితం తనకు ప్రమాదం జరిగిందని, కాలు తొలగించారని ఆ ప్రమాదానికి కారణం కూడా కబ్జాదారులే అన్న అనుమానం ఉందన్నారు. పోలీసులే న్యాయం చేయకపోతే ఇంకా ఎవరు న్యాయం చేస్తారంటూ ప్రశ్నించారు. మస్తాన్‌వలి తల్లి షేక్ షహీదా మాట్లాడుతూ తమకు న్యాయం చేయాలని, తమ స్థలాన్ని తమకు ఇప్పించాలని వేడుకున్నారు. ప్రభుత్వ పెద్దలు స్పందించాలని, పోలీసు ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని తమకు చెందిన 280 గజాల స్థలాన్ని తమకు ఇప్పించాలని కోరారు. ఆస్తికి సంబంధించిన పూర్తి డాక్యుమెంట్స్ తమవద్దే ఉన్నాయని స్పష్టం చేశారు. తమపై దాడి చేసిన వారి నుంచి ప్రాణహానే ఉందని తమకు రక్షణ కల్పించాలని అలాగే వారిపై కఠినమైన, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసు ఉన్నతాధికారులను కోరారు.

పల్లెల్లోని పేదలకు కార్పొరేట్ వైద్య సేవలు

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు: ప్రముఖ డాక్టర్ సి.ఎల్ వెంకటరావు పల్లెల్లో కార్పొరేట్ వైద్యం అందిస్తున్నారు. ఆదివారం జిల్లాలోని నలుమూలల నుంచి వచ్చిన 540 మందికి గుడ్లవల్లేరు వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు చేశారు. గ్యాస్ట్రోఎంట్రాలజీ ఆరోగ్య సమస్యలతో బాధ పడుతున్న రోగులకు డాక్టర్ సి.ఎల్ వెంకటరావు, నేత్ర సమస్యలకు ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి టెక్నీషియన్లు కణితి శశిరేఖ హనుమకొండ దుర్గ భవాని, గుండె, ఊపిరితిత్తుల సమస్యలకు విజయవాడ కామినేని హాస్పిటల్ వైద్యులు ఎస్.దాశరథి, లింగం శెట్టి వర్ధన్, సాధారణ వైద్యానికి గుడివాడ హోమియో వైద్యులు పి భవాని, తమ వైద్య సేవలను రోగులకు అందించారు. అనంతరం అవసరమైన రోగులకు డాక్టర్ సి ఎల్ వెంకటరావు చేతుల మీదుగా ఉచిత మందులను పంపిణీ చేశారు.

మండుతున్న సూరీడు

విశాలాంధ్ర-కూచిపూడి : మార్చి 2వ తేదీనే ఉష్ణోగ్రతలు విస్తృతంగా వేయడంతో మధ్యాహ్నం 12 గంటలకే ప్రధాన రహదారులు బోసిపోయి కర్ఫ్యూని తలపిస్తున్నాయి. ఆదివారం ఉదయం 10 గంటలకి వాతావరణంలో ఉష్ణోగ్రతలు32డిగ్రీల నమోదై క్రమేణా పెరిగి మధ్యాహ్నానికి 35 డిగ్రీలకు చేరుకొంది. మార్చినెలప్రారంభంలోనేఉష్ణోగ్రతలు ఈవిధంగాఉంటేభవిష్యత్తులో ఎండలు, వడగాలులు మరింత పెరిగే అవకాశం ఉంటుందని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభం

విశాలాంధ్ర -కూచిపూడి : నెల రోజులు పాటు కొనసాగే రంజాన్ వేడుకలు శనివారం రాత్రి చంద్రోదయం (నెలపొడుపు) చూసిన నంతరంఆదివారం వేకువజాము నుంచి దీక్షలను ప్రారంభించారు.. మొవ్వ మండలంలోనిడుమోలు, కోసూరు తురకపాలెం, మొవ్వ, పెదపూడి, భట్ల పెనుమర్రు లలోని ఒక్కొక్క మసీదులో, కాజలో రెండు మసీదులలో ఐదు సార్లు ప్రార్థనలు నిర్వహించి ఖురాన్ పఠించారు. రోజుల్లా ఉపవాస దీక్ష నిర్వహించిన ముస్లింలు సాయంత్రానికి మసీదుల వద్ద నమాజు నిర్వహించి ఇఫ్తార్ విందుతోతొలి రోజు ఉపవాస దీక్ష విరమించారు.

పేదలకు అండగా మానవత స్వచ్ఛంద సేవా సంస్థ

విశాలాంధ్ర-పెడన : నిరుపేదలకు వృద్ధులకు మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని సంస్థ అధ్యక్షులు మట్టా. రాధాకృష్ణమూర్తి అన్నారు. ఈ మేరకు పట్టణంలో 3 వ వార్డు కి చెందిన చేనేత కార్మికురాలు మెట్ల. లక్ష్మి (65) సంవత్సరాలు మంచానికే పరిమితమై సహకరించిన ఆరోగ్యంతో పాటు వృద్ధాప్యం రోజు గడవని దయనీయ స్థితి వారి కుటుంబ సమస్య తెలియగానే మానవత స్వచ్ఛంద సేవా సంస్థ తరఫున రూ 3000 నెలకు సరిపడ నిత్యావసర వస్తువులు వితరణగా అందించారు. ఈ కార్యక్రమం లో ప్రధాన కార్యదర్శి పూటకూరి. సుబ్బారావు, కోశాధికారి కాగిత. శంకర. సాంబశివరావు, సభ్యులు కొసనం.భార్గవ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీసంపటాలమ్మ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే మండలి

విశాలాంధ్ర-చల్లపల్లి : చల్లపల్లి గ్రామదేవత శ్రీసంపటాలమ్మ అమ్మవారి 26వ వార్షికోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. వేదపండితులు ఘంటసాల శతానందశాస్త్రి, ఆలయ పూజారి చల్లపల్లి కోటేశ్వరరావు దంపతులు, అమ్మవారికి విశేష పూజలు చేసి అలంకరణలు చేశారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు సమర్పించుకున్నారు. వేలాదిమంది భక్తుల రాకతో ఆలయం కిటకిటలాడింది. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ కమిటీ పెద్దలు యడ్ల మదుసూధనరావు, లంక కొండలు, రావులపల్లి వెంకటేశ్వరరావు, గొర్రెపాటి పిచ్చేశ్వరరావు, వేముల శేషగిరిరావు, విస్సకోట శంకర్, కొల్లిపర సాంబశివరావు, గొరిపర్తి మోహనరావులు ఆలయ మర్యాదలతో ఎమ్మెల్యేను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, వైస్ఎంపీపీ మోర్ల రాంబాబు, ఉపసర్పంచ్ ముమ్మనేని నాని, టీడీపీ నేతలు రావి చిట్టి, వేముల హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు. అమ్మవారి వార్షికోత్సవం సందర్భంగా భక్తులకు అన్నసమారాధన జరిగింది. సుమారు ఏడువేల మంది భక్తులు అమ్మవారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. పలువురు భక్తులు స్వచ్ఛంధంగా సేవలందించారు.

రాజేంద్ర ఇంట పెళ్లి వేడుకలకు హాజరైన సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర, ఉయ్యూరు : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదివారం స్థానిక మాజీ శాసన మండల సభ్యులు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వైవిబి రాజేంద్రప్రసాద్ ఇంట జరిగిన పెళ్లి వేడుకలు (నిశ్చయ తాంబూలాలు) హాజరయ్యారు. ఆయన స్వగృహంలో ఆదివారం రాజేంద్ర ప్రసాద్ రెండవకుమార్తె నిశ్చయ తాం బూలాల వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు ప్రత్యేక ఆహ్వానితులుగా ముఖ్యమంత్రి, రాష్ట్ర మంత్రులు, అధికార ప్రతినిధులు, తెలుగు దేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రోడ్డు మార్గమున ఉయ్యూరు చేరుకొని నూతన వధూవరులను ఆశీర్వ దించి వెళ్లారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు కొలుసు పార్థసారథి, కొల్లు రవీంద్ర, మాజీ మంత్రి దేవినేని ఉమా, ఆర్టీసీ చైర్మన్ కొనగళ్ళ నారాయణ పలువురు అధికార పార్టీ నాయకులు పాల్గొన్నారు ముఖ్యమంత్రి రాకను దృష్టిలో ఉంచుకొని ఎస్పీ గంగాధర్ నేతృత్వంలో పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.

రేపు స్వామివారి హుండీ లెక్కింపు

విశాలాంధ్ర -గంపలగూడెం: ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రసిద్ధిగాంచిన, ఎన్టీఆర్ జిల్లా, గంపలగూడెం మండలం, నెమలి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ వేణుగోపాల స్వామి వారి దేవస్థానం నందు మంగళవారం స్వామి వారి హుండీల లో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించడం జరుగుతుందని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ నేల సంధ్య తెలిపారు.

2030 నాటికి ఒక మిలియన్ విద్యార్థులను శక్తివంతంగా చేయాలి : అశోక్ హిందూజా

విశాలాంధ్ర- విజయవాడ లబ్బీపేట : 2030 నాటికి 1 మిలియన్ విద్యార్థులను శక్తివంతం చేయాలనే ప్రతిష్టాత్మక ప్రణాళికలతో, హిందూజా ఫౌండేషన్ విద్యను మార్చుకు ఉత్ప్రేరకంగా కొనసాగిస్తోందని సంస్థ ప్రతినిధులు ప్రకటనలో తెలిపారు. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధంఖర్, మహారాష్ట్ర గవర్నర్ సి.పి. రాధాకృష్ణన్ కూడా గౌరవ అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి జగదీప్ ధంఖర్ మాట్లాడుతూ, "సనాతన దేశ సంస్కృతి విద్యలో భాగం కావాలన్నారు. ప్రత్యేక సంస్థలను సృష్టించడానికి కార్పొరేట్ ఇండియా విద్యలో పెట్టుబడి పెట్టాలని కూడా ఆయన కోరారు. హిందూజా కళాశాల కేవలం డీమ్డ్ విశ్వవిద్యాలయంగా మారడంతోనే ఆగకుండా, ప్రపంచ ప్రఖ్యాత సంస్థగా మారుతుందని ఆయన తన విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. హిందూజా ఫౌండేషన్ చైర్మన్ అశోక్ హిందూజా, మాట్లాడుతూ " కళాశాల ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్ వెల్త్ మేనేజ్‌మెంట్‌లో కొత్త ప్రోగ్రామ్‌లను, క్లైమేట్ ఫైనాన్స్ ఎగుమతి-దిగుమతి నిర్వహణలో ప్రత్యేక కోర్సులను ప్రవేశపెట్టాలని యోచిస్తోందన్నారు. హిందూజా ఫౌండేషన్ అధ్యక్షుడు పాల్ అబ్రహం మాట్లాడుతూ, "అత్యాధునిక మౌలిక సదుపా యాలు ఆధునిక సౌకర్యాలతో కూడిన అత్యాధునిక, బహుళ అంతస్తుల సౌకర్యాన్ని నిర్మించడానికి హిందూజా కళాశాల పునరాభివృద్ధి చెందుతోంద న్నారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ 2028 నాటికి పూర్తవుతుందని భావిస్తున్నా మన్నారు. హిందూజా కళాశాల 30 కంటే ఎక్కువ విద్యా కార్యక్రమాలను అందిస్తుంది మరియు 2023-24లో %హిూూజ ూ% గుర్తింపును సాధించిందనారు. 2022లో స్వయంప్రతిపత్తి హోదా పొందిన ఈ కళాశాల, విద్యార్థులను భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న నైపుణ్యాలతో సన్నద్ధం చేయడానికి జాతీయ విద్యా విధానం 2020తో జతకట్టిందన్నారు.

ఏ తల్లి కన్నబిడ్డో?

- 12 రోజుల కిందట వీటీపీఎస్ కాలువ సంపులో బాలుడి మృతదేహం
- నేటికీ లభించని వివరాలు
- పోస్టుమార్టం.. అంత్యక్రియలు పూర్తి
- పెండింగ్‌లోనే పోస్టుమార్టం రిపోర్టు

విశాలాంధ్ర-విజయవాడ క్రైం: ఏ తల్లి కన్నబిడ్డో తెలియదు... ఇక్కడికి ఎలా వచ్చాడో తెలియదు... నీటిలో తేలియాడుతూ మృతదేహం లభించి 12 రోజులైనా ఆ బాలుడికి సంబంధించిన ఏ ఒక్క విషయమూ తెలియలేదు. గత నెల 19వ తేదీన భవానీపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని గొల్లపూడి మైలురాయి సెంటర్ లోపల ఉన్న దళిత కాలనీ వద్ద వీటీపీఎస్ కాలువ, పంటకాలువ కలిసే సంప్‌లో సుమారు 8 ఏళ్ల బాలుడి మృతదేహం కనిపించింది. స్థానికుల సమాచారం మేరకు భవానీపురం పోలీసులు వెళ్లి మృతదేహాన్ని వెలికి తీసి ప్రభుత్వాస్పత్రికి తరలించి పోస్టుమార్టం చేయించారు. అప్పటికే బాలుడు మృతిచెంది రెండు, మూడు రోజులై ఉంటుందని గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, బాపట్ల, ఏలూరు జిల్లాలతోపాటు పొరుగున ఉన్న తెలంగాణ జిల్లాల పోలీస్ స్టేషన్లకు సమాచారం ఇచ్చారు. అక్కడ బాలుర మిస్సింగ్ కేసులు వివరాలు పరిశీలించాలని కోరారు. అయినా ఎక్కడి నుంచి తగిన సమాచారం రాలేదని తెలిసింది. బాలుడి మృతదేహానికి పోస్టుమార్టం తర్వాత మూడు రోజులు మార్చురీలో ఉంచారు. అనంతరం కార్పొరేషన్ సిబ్బందికి అప్పగించడంతో అనాథ మృతదేహంగా అంత్యక్రియలు కూడా పూర్తి చేశారు. ఆ తర్వాత ఈ కేసు గురించి పోలీసులు పెద్దగా పట్టించుకున్న దాఖలాలు లేవు. పోస్టుమార్టం నివేదిక ఆదివారం వరకు రాలేదని తెలిసింది. పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాత కేసు దర్యాప్తు గురించి ఆలోచించాలని పక్కన పెట్టినట్లు తెలిసింది. అసలు ఈ బాలుడు ఎక్కడి వాడు... ఇక్కడ అతని మృతదేహం ఎలా పడి ఉంది... ఎక్కడైనా చంపి ఇక్కడ పడేశారా..? అనే అనుమానాలను స్థానికులు వ్యక్తంచేస్తున్నారు. ఒకవేళ ఆటలాడుకుంటూ ప్రమాదవశాత్తూ కాలువలో పడి మరణిస్తే స్థానికులు ఇప్పటికే ఆ ఆలుడిని గుర్తించి ఉండేవారు. కాబట్టి ఎక్కడి నుంచో తీసుకువచ్చి ఇక్కడ పడేసి ఉంటారని భావిస్తున్నారు. పోలీసులు పూర్తిస్థాయిలో దృష్టి పెట్టి దర్యాప్తు చేస్తే బాలుడి మృతి మిస్టరీ వీడే అవకాశం ఉంది.

శిశు గృహ సిబ్బందికి చిన్నారులు

విశాలాంధ్ర-విజయవాడ క్రైం: పిల్లల్ని అమ్మే ముఠాను నుంచి కాపాడిన నలుగురు శిశువులను విజయవాడ పోలీసులు కేర్ అండ్ ప్రొటెక్షన్‌కు అప్పగించినట్లు స్త్రీ అభివృద్ధి, శిశు సంక్షేమ ఎన్టీఆర్ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ దాసరి లక్ష్మీ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 1వతేదీన టాస్క్‌ఫోర్స్ పోలీసులు పిల్లల సమాచారం అందించారన్నారు. డీసీపీయు, ఐసీడీఎస్, వన్‌స్టాప్ సెంటర్, శిశు గృహ సిబ్బందిని పాయకాపురం పోలీస్ స్టేషన్‌కు పంపడం జరిగిందన్నారు. అక్కడ సుమారు 15 నెలల మగ శిశువు, 7నెలల మగ శిశువు, నెల ఆడ శిశులను అప్పగించారన్నారు. ఆదివారం మరో శిశువును అప్పగించారు. బలగం సరోజిని అనే మహిళ పిల్లలను విక్రయిస్తున్నారని, వారి వద్ద నుంచి పిల్లలను పోలీసులు స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. పిల్లలను కేర్ అండ్ ప్రొటెక్షన్ నిమిత్తం అప్పగించినట్లు తెలియజేశారు. పిల్లలను బుద్ధవరంలోని శిశువు గృహానికి తరలించారు. శిశువు గృహంలో పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఏడు నెలల శిశువుకు పచ్చకామెర్లు ఉన్నట్లు గుర్తించారు. వెంటనే సీడబ్ల్యూసీ అధికారులకు, పోలీసులకు సమాచారం అందించి, విజయవాడ పాత ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ అధికారులు కేసు పూర్వాపరాలు పరిశీలించిన తర్వాత ఢిల్లీ, అహ్మదాబాద్ చైల్డ్ వెల్ఫేర్ కమిటీ వారితో సంప్రదించి తగిన చర్యలు తీసుకొంటామని తెలిపారు.

ఆర్టీసీ బస్సుల్లో టైం టేబుల్ ఏర్పాటు చేయండి

విశాలాంధ్ర -పమిడిముక్కల: గతంలో ఆర్టీసీ బస్సుల్లో అందరికీ తెలిసేలా కాలనిర్ణయ పట్టికలు(టైం టేబుల్) అమర్చే వారు, కాలక్రమేణా బోర్డు లు మాత్రమే ఉన్నాయని , యాజమాన్యం వాటిని పట్టించుకోవడం లేదని ప్రయాణికులు విమర్శిస్తున్నారు.ఆ పట్టికలు ఉండటంతో సమయానికి గమ్యం చేరతామనే ఆలోచన ఉండేదని, ప్రస్తుతం ఏ బస్సు ఏ టైం కి గమ్యం చేరుతుందో అర్థం కావడంలేదని అంటున్నారు.ప్రత్యేకం గా అద్దె బస్సుల్లో కొన్నింటిలో మాత్రం సమయాల పట్టిక ఉన్నాయని ప్రభుత్వం తే నడిచే బస్సుల్లో అసలు ఆ పట్టికలు కనపడటం లేదని దూర ప్రాంతాలకు వెళ్లే బస్సుల్లో కూడా సమయపాలన పట్టికలు లేకపోవడం తో బస్సులు ఏ సమయానికి గమ్యం చేరుతుందో తెలియక ఇబ్బందులు పడుతున్నామని ప్రయాణికులు అంటున్నారు. గతం లో పల్లె వెలుగు బస్సుల్లో కూడా ప్రథమ చికిత్స కిట్టు,సమయ పాలన పట్టిక తప్పకుండా ఉండేవని కాలం చెల్లిన బస్సులతో ఆర్టీసీ కాలక్షేపం చేస్తోందని పలువురు అంటున్నారు.గ్రామల్లో బస్సులు రాక పోకల బోర్డులు ఉండేవని అవి కూడా కాల క్రమేణా కనుమరుగు అయ్యాయి.బస్సు వస్తే వచ్చినట్లు లేక పోతే సర్వీసు లేదని రద్దు చేస్తున్నారని విద్యార్థులు అంటున్నారు. ఆర్డినరీ బస్సులు వేసి మెట్రో ఛార్జీలు వసూలు చేస్తున్నారని ప్రయాణికులు వాపోతున్నారు. ముఖ్యంగా మచిలీపట్నం నుండి విజయవాడ వెళ్ళే పాసెంజర్ బస్సులు రద్దీగా లేక పోయినా ప్రయాణికులు వున్నా ఆయా స్టేజీల్లో ఆపకుండా వెళ్లిపోతున్నారని వాపోతున్నారు. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమయ పాలన పట్టికలు ఏర్పాటు చేయించాలని, కాలం చెల్లిన బస్సులను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇటుకల తయారీలో నిబంధనలకు నీళ్లు!

-అక్రమ రవాణా, శ్రమదోపిడీ వెరసి అధికాదాయం

-ఇటుకల తయారీలో నిబంధనలకు నీళ్లు

విశాలాంధ్ర, విస్సన్నపేట : సాగునీటి చెరువుల్లో అనుమతి లేకుండా మట్టి తరలిస్తారు. వీటితో అత్యల్ప వేతనంపై వలస కూలీలతో వెట్టిచాకిరీ చేయించి, ఇటుకలు తయారు చేయిస్తారు. ఎటువంటి అనుమతులు లేకుండానే చెట్లను ఇష్టానుసారం నరికి, వీటికి పన్నులు చెల్లించకుండా తెలంగాణా నుంచి తెచ్చిన బొగ్గులతో కలిపి ప్రధాన రహదారుల సమీపంలో కాలుస్తూ, వాతావరణ కాలుష్యం, రాకపోకలు చేసేవారికి అనారోగ్యం సృష్టిస్తారు. తయారైన ఇటుకలను పెద్దమొత్తం ధరకు విక్రయాలు చేస్తూ మధ్యతరగతిని అందని స్థితి కల్పిస్తారు. అయినా ఈ వ్యవహారాలేమీ మండల, గ్రామ స్థాయి అధికారులకు సైతం తెలియని, తెలిసినా పట్టించు కోని పరిస్థితి మండలంలో నెలకొంది. మండలంలో ప్రధానంగా పుట్రేల, కలగర, తాతకుంట్ల, కొండపర్వ, వేమిరెడ్డిపల్లి, కొర్లమండ పంచాయతీల్లో పెద్దఎత్తున ఇటుక బట్టీలు కొనసాగుతున్నాయి. సమీప ప్రాంతాల్లోని చెరువుల్లోని మట్టిని పలు గ్రామాల్లో సొంత ట్రాక్టర్లతో బట్టీల వద్దకు తరలిస్తున్నారు. ఈ మట్టిని ఇటుకలుగా తయారు చేసేందుకు తెలంగాణా, ఒరిస్సా, బీహార్ వంటి పలు రాష్ట్రాలకు చెందిన వలస కూలీలను తీసుకొస్తున్నారు. ఇటుకకు సుమారు ఒక్క రూపాయి చొప్పున అత్యల్పంగా వారికి చెల్లించి ఇటుకలు తయారు చేయిస్తున్నారు. ఇలా చేసేందుకు అవసరమైన నీటికోసం కూడా వ్యవసాయ బోర్లను వినియోగిస్తున్నారు. నీరు చాలకుంటే వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తూ, రాత్రికి రాత్రే కొత్త బోరుబావులు ఏర్పాటు చేసుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. తయారైన ఇటుకలను బట్టీలుగా అమర్చి ఎర్రగా కాల్చాల్సి ఉంటుంది. ఇందుకు పలు గ్రామాల్లో పెరిగిన చెట్లను అటవీశాఖ నుంచి ఎటువంటి అనుమతులు లేకుండానే నరికి, ఇక్కడికి తరలిస్తున్నారు. రహదారి మార్జిన్లలో పెరిగిన భారీ వృక్షాలను సైతం నరికి పెద్దఎత్తున బట్టీల వద్దకు తరలిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీటికి తెలంగాణా రాష్ట్రం నుంచి తీసుకొచ్చిన బొగ్గులను జత చేసి, బట్టీలకు నిప్పు పెడుతున్నారు. కనీసం మూడు నుంచి వారంరోజుల పాటు మండుతున్న బట్టీల కారణంగా సమీప గ్రామాల్లో పొగ వ్యాపించి, ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. గ్రామానికి వచ్చే ప్రధాన రహదారి సమీపంలో ఇవి ఉండటంతో ఈ మార్గంలో ప్రయాణించేవారు పొగ, దూళి కారణంగా ప్రమాదాల బారిన సైతం పడుతున్న సంఘటనలు ఉంటున్నాయి. ఇంతా చేసి, ఇటుకలను విక్రయించే ధరలో మాత్రం రాజీ లేని పరిస్థితి నెలకొంటోంది. ఒక్కొక్క ఇటుకను సుమారు రూ.6ల నుంచి రూ.8ల వరకు విక్రయాలు చేస్తూ, మధ్య, పేద వర్గాలకు గృహ తదితర నిర్మాణ పనులను అందని ద్రాక్షగా మారుస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు విస్సన్నపేట మండలంలో కొనసాగుతున్న ఇటుకబట్టీలకు అవసరమైన అనమతులు, వాటికి అవసరమైన ముడిసరకు లభ్యత, కూలీ చెల్లింపు, ధరల వివరాలపై విచారించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

పంచాయితీ నిధుల దుర్వినియోగం

-రూ.10.77,132. కైంకర్యం

-ఆలస్యంగా వెలుగులోకి

-పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

విశాలాంధ్ర-కూచిపూడి : కాజ పంచాయతీలో రూ. 10,77,132 కైంకర్యమయ్యాయయని మొవ్వ ఈ.ఓ.పి. ఆర్.డి. ఎంఎస్‌కె పరమాత్మ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళ్లితే.. ఆ గ్రామపంచాయతీ జూనియర్ అసిస్టెంట్‌గా గ్రామ పెద్దల సమక్షంలో కాజ-1 సచివాలయ గ్రేడ్ 5 కార్యదర్శి కృష్ణ ప్రియాంక, పంచాయతీ కాంట్రాక్టు ఉద్యోగి మందహరీష్ కృష్ణారెడ్డిలు పంచాయతీలో పనులతో వసూలుచేసిన నగదు రూ.15,28,792 జూనియర్ అసిస్టెంట్‌కి అందజేశారు. గ్రామ పంచాయతీకి సంబంధించిన రాబడులు, ఖర్చుల వివరాల రికార్డులు అందజేశారు. సిబ్బంది అందజేసిన నగదులో కొంత మొత్తాన్ని పంచాయతీ ఖాతాలో జమచేసి మిగిలిన సొమ్మును జూనియర్ అసిస్టెంట్‌కి వాడుకున్నట్లుగా ఉన్నతాధికారుల పరిశీలనలో వెల్లడైంది. పంచాయతీ సొమ్ములో రూ.10.77,132 దుర్వినియోగమైనట్లు గుర్తించిన అధికారులు గత ఏడాది జులైలో అతన్ని సస్పెండ్ చేశారు. గత ఏడాది డిసెంబర్ లో అతనికపై క్రిమినల్ కేసు నమోదు చేయాల్సిందిగా ఈ.ఓ.పి.ఆర్.డి. కృష్ణ పరమాత్మను జిల్లా పంచాయతీ అధికారి ఆదేశించారు. అప్పట్లో విధులు నిర్వహించిన పంచాయతీ కార్యదర్శి ఏ .డి. వి .ఎల్.ప్రసాద్ డిసెంబర్‌లో పదవి విరమణ చేశారు. అధికారుల ఆదేశాల మేరకు ఈ ఏడాది జనవరి 17వ తేదీన ఈఓపిఆర్‌డి కూచిపూడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పూర్తి వివరాలు పంపించినట్లు ఈ.ఓ.పి. ఆర్.డి. పేర్కొంటుండగా దీనికి సంబంధించిన ఇంకొన్ని డాక్యుమెంట్లు అధికారులు అందించాల్సి ఉందని కూచిపూడి ఎస్ఐ ఎం సుబ్రహ్మణ్యం పేర్కొంటున్నారు. రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ మైలవరపు వి ఆర్ కృష్ణ తేజ లోకాయుక్తకు సమర్పించిన నివేదికలో పేర్కొన్నారు. దుర్వినియోగమైననిధులలో ఇంటి పన్ను రూ.8,96,273, 68,400 ప్రైవేట్.టాప్ (కుళాయి)ఏ ఫీజులు, ప్రైవేట్.టాప్ కాంట్రిబ్యూషన్ రూ.9200, రూ.11 వేలు ఆశీలుకలెక్షన్, రూ.90,000 చేపల చెరువు పాటల నిధులు, రూ.2,259 మిస్సయిలియన్స్ రిసిప్స్ మొత్తాలను పంచాయతీలో అతను జమ చేయలేదని పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణ తేజ లోకాయత్తలో ఫిర్యాదు చేశారు.

శ్రీ కొండలమ్మను దర్శించుకున్న భక్తులు

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు: మండలంని వేమవరం గ్రామములో వేంచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానములో ఆదివారం సంధర్భంగా శ్రీ అమ్మవారిని సుమారు 15,000 పైగా భక్తులు దర్శించుకొనినారు. అత్యధిక స్థాయిలో భక్తులు శ్రీ అమ్మవారికి పాలపొంగళ్ళు సమర్పించి, వారి యొక్క మొక్కుబడులు తీర్చుకొనినారు. శ్రీ అమ్మవారి దేవస్థానమునకు విచ్చేసిన భక్తులకు త్రాగు నీరు, శానిటేషన్ ఏర్పాట్లు మరియు ఏ విధమైన అసౌకర్యములు కలగకుండా దర్శనం చేసుకొనుటకు దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అక్రమ మట్టి తరలింపుపై ఉక్కుపాదం

విశాలాంధ్ర-బంటుమిల్లి :- ప్రభుత్వ అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని బంటుమిల్లి తహశీల్దార్ కెవి పూర్ణచంద్రరావు హెచ్చరించారు. ముంజులూరులో ఆదివారం ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తున్నా ట్రాక్టర్ ను మచిలీపట్నం రెవిన్యూ డివిజనల్ అధికారి ఆదేశానుసారం సీజ్ చేసి బంటుమిల్లి తహసీల్దార్ కార్యాలయానికి తరలించి 1500 రూపాయలను జరిమాన విధించడమైనదని బంటుమిల్లి మండల రెవెన్యూ ఇనస్పెక్టర్ బత్తిన శివశంకర్ తెలిపారు .మండల పరిధిలో ప్రభుత్వ అనుమతులు లేకుండా చేపల చెరువులు ,రొయ్యల చెరువులు త్రవ్వకాలు జరిపిన ,అక్రమంగా మట్టిని తరలించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన రెవెన్యూ ఇనస్పెక్టర్ బత్తిన శివశంకర్ హెచ్చరించారు.

మొవ్వ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తనిఖీలు

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన ఆస్తులు అక్రమ రిజిస్ట్రేషన్ జరిగిన సంఘటనపై శనివారం సాయంత్రం నుంచి చీకటిపడేవరకు మంగళగిరి పోలీసులు రికార్డులు పరిశీలించారు. ఈ విషయం బయటకు తెలియకుండా గోప్యంగా ఉంచారు. అక్రమ రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన విచారణలో భాగంగా మంగళగిరి నుంచి అధికారులు వచ్చి రెండు గంటలకు పైగా విచారణ చేశారు. మంగళగిరి పరిధిలోని కురగల్లు గ్రామంకు చెందిన చనిపోయిన తోట వేంకటేశ్వరరావుకు చెందిన సర్వే నెం.25లోని సుమారు 1000 చదరపు గజాల స్థలాన్నిఆధార్ కార్డు మార్ఫింగ్ చేసి రిజిస్ట్రేషన్ చేయించి దానిని విక్రయానికి ప్రయత్నించడం ఆ విషయం వెలుగులోకి రావడంతో రిజిస్ట్రేషన్ రద్దు చేయించారు. ఆస్థల యజమానురాలు ఈ విషయాన్ని మంగళగిరిలోనే ఐటి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కార్యాలయంలో ఫిర్యాదు చేయడంతో ఆయన విచారణకు ఆదేశించినట్లు తెలిసింది. ఫిబ్రవరి 20న అక్రమ రిజిస్ట్రేషన్ పైస్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నత అధికారులు దృష్టి సారించారు. కృష్ణాజిల్లాలో ఏ కార్యాలయంలోనూ లేనివిధంగా మొవ్వరిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఎనీ వేర్ రిజిస్ట్రేషన్ పద్ధతి లో రిజిస్ట్రేషన్ జరగడం అందులోనూ ఆధార్ మార్ఫింగ్ చేసి మంగళగిరి ప్రాంతంలో చనిపోయిన వ్యక్తి ఆస్థి మొవ్వ సబ్ రిజిస్టార్ కార్యాలయంలో జరగడం, పోలీస్ శాఖ ఈ రిజిస్ట్రేషన్ పై కేసు నమోదు చేసి విచారణ చేసి అంశాలు స్థానికంగా తీవ్ర చర్చనీయాంసంగా మారాయి.

వాకర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

విశాలాంధ్ర ఉయ్యూరు : స్థానిక ఏజీ అండ్ ఎస్ జి కళాశాల వాకర్స్ అసోసియేషన్ తరపున ఆదివారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. స్థానిక హోప్ హాస్పటల్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ వైద్య శిబిరంలో 120 మందిని పరీక్షించి ఉచితంగా మందులు అందించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ తిరుమల రావు, పొగిరి రాము కార్యదర్శి కోడిబోయిన సాంబశివరావు, వైద్యశాల వైద్యులు శ్రీనివాసరెడ్డి, డాక్టర్ జ్యోతి వైద్య సేవ అందించారు.

అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ సమస్యలు పరిష్కరిస్తాం

-విభజన అంశాలను త్వరలోనే పరిష్కరిస్తాం

-సిబ్బంది పెండింగ్ జీతాలు చెల్లిస్తాం

-తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ హామీ

విశాలాంధ్ర-విజయవాడ: ఆంధ్రప్రదేశ్లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్లలో పనిచేస్తున్న సిబ్బందికి పెండింగ్లో ఉన్న జీతాలను విడుదల చేసే విషయమై త్వరితగతన పరిష్కారం చూపుతామని తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకృష్టారెడ్డి హామీ ఇచ్చారు. దీనితోపాటు విభజన చట్టంలో ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అంశాన్ని కూడా ఉభయ రాష్ట్రాల ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కారం అయ్యేలా చూస్తానని ఆయన అభయం ఇచ్చారు. బాలకృష్టారెడ్డిని ఆంధ్రప్రదేశ్ లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఓఎస్డి డాక్టర్ వెల గా జోషి మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై వారు చర్చించారు. విభజన చట్టం ప్రకారం 10ఏళ్ళు పూర్తయిన నేపథ్యంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ విధివిధానాలు మారాయి .దీంతో గడిచిన ఏడాదికాలంగా ఆంధ్రప్రదేశ్ లో ఉన్న దాదాపు 30 వేలకు పైగా ఓపెన్ యూనివర్సిటీ ద్వారా విద్యను అభ్యసించే విద్యార్థులు ఓపెన్ యూనివర్సిటీలో అడ్మిషన్లు లేక నష్టపోతున్నారు. ఇదే అంశాన్ని తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకృష్టా రెడ్డి గారి దృష్టికి డాక్టర్ వెలగా జోషి తీసుకెళ్లారు. అడ్మిషన్లు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారని, త్వరితగతిన ఈ అంశాన్ని పరిష్కరించాలని బాలకృష్టా రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఉన్నత విద్యా మండలి చైర్మన్ సానుకూలంగా స్పందించారు. దీనితోపాటు ఆంధ్రప్రదేశ్లో ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్లలో పనిచేసే సిబ్బందికి జీతభత్యాలు నిలిచిపోయిన అంశం గురించి కూడా చైర్మన్ సావధానంగా పరిశీలిస్తానని హామీ ఇచ్చారు. చైర్మన్ సానుకూలంగా స్పందించడం డాక్టర్ వెలగా జోషి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో ఎదగాలి : డీఈఓ

విశాలాంధ్ర-కూచిపూడి : విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నతులుగా ఎదగాలని కృష్ణా జిల్లా విద్యాశాఖాధికారి పి .విజయరామారావు సూచించారు. మొవ్వ పీఎం శ్రీశ్రీమండవ కనకయ్య జెడ్పీ హైస్కూల్ 79వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన సభా కార్యక్రమం లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రతి విద్యార్థి చదువుతోపాటు క్రీడలలో సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొంటూ నాయకత్వ లక్షణాలు(కమ్యూనిటీ స్కిల్స్) పెంపొందించుకొని జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. హెచ్ఎం సూర్యదేవర శ్రీదేవి అధ్యక్ష తన జరిగిన కార్యక్రమంలో ఉప విద్యాశాఖ అధికారిణి(ఉయ్యూరు) ఐ. పద్మారాణి, ఎంఈఓ ఎన్ శివశంకరరావు, కే శ్రీలక్ష్మి, ప్రవాస భారతీయులు ఎం శేషగిరిరావు, విశ్రాంత హెచ్ఎం మండవ నీలవేణి, స్కూలు విద్యా కమిటీ చైర్మన్ గురిందపల్లిబాబురావు, పిడి అప్పిగట్ల రామారావు తదితరులు పాల్గొన్నారు. ఈ వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు ఆనందోత్సాహాల నడుమ సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి విద్యార్థుల ద్వారా భోజన పరిస్థితి అడిగి తెలుసుకున్నారు.

చెత్తశుద్ధి నిర్వహణ

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: చెత్త నుంచి సంపద సృష్టి దిశగా కార్యక్రమాన్ని ఆదివారం నుంచి ప్రారంభించినట్లు విస్సన్నపేట పంచాయతీ నిర్వహణాధికారి హరికృష్ణ కుమార్ తెలిపారు. విస్సన్నపేట పంచాయతీలోని వివిధ ప్రాంతాల నుంచి సమకూరిన తడి, పొడి చెత్తను వేరు చేసి, ఈ ప్లాంట్ ద్వారా సేంద్రియ ఎరువులను తయారు చేయనున్నామని ఆయన వివరించారు.

నేడు మద్యం దుకాణాల బంద్

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: కృష్ణా, గుంటూరు జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల లెక్కింపు కార్యక్రమం సందర్భంగా సోమవారం మద్యం దుకాణాలను మూసివేయాలని తిరువూరు ఎక్సైజు సీఐ జె.శ్రీనివాస్ మద్యం దుకాణదారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆదివారం రాత్రి 10గంటలకు మూసివేసిన దుకాణాలను మంగళవారం ఉదయం వరకు తెరవరాదని ఆయన అన్నారు. మద్యం విక్రయాల సమయంలో బెల్టు దుకాణదారులు చొరబడకుండా దుకాణ యజమానులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఆయన సూచించారు.

బిగ్ టీవీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

విశాలాంధ్ర-కంచికచర్ల: స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఆదివారం బిగ్ టీవీ, స్వర కెయంఆర్ ఉచిత వైద్య శిబిరానికి స్పందన వచ్చింది. వైద్యులు మద్దారి అరవింద సూర్య, డాక్టర్ రవీందర్ బాబు, స్వరాజ్యం వీరమాచినేని రోగులను పరీక్షించారు. మధుమేహం, బీపీ, షుగర్, టుడియకొ, ఈసీజీ చేసి మందులు పంపిణీ చేశారు.

ఉపాధి హామీ నిధులపై ఆడిట్

విశాలాంధ్ర-పెదపారుపూడి : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు 2023-24 సంవత్సరానికి వేతనాల నిమిత్తం మండలంలోని19 గ్రామ పంచాయతీల పరిధిలో రూ7, 80,15,865లు వేతనాల నిమిత్తం ఖర్చు చేసినట్లు. మెటీరియల్ రూపంలో రూ 1, 74, 11,465 లు వాటిలో ఒక కోటి 48 లక్షలు పంచాయతీరాజ్ డిపార్ట్మెంట్ నిమిత్తం ఖర్చు చేసినట్లు, మొత్తంగా రూ9 కోట్ల 54 లక్షల 27, 330లు ఖర్చు చేసిన విధానంపై ఆడిట్ ఆదివారం ప్రారంభించినట్లు స్టేట్ రిసోర్స్ పర్సన్ సిహెచ్. ఎన్. సత్యనారాయణ ఒక ప్రకటనలో ఆదివారం తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్పిలు కే. విజయకుమార్, బి. వెంకటసుబ్బయ్య, జి. జగదీష్ ల ఆధ్వర్యంలో ఆడిట్ నిర్వహిస్తున్నామని ఆయన వివరించారు.

ఎల్‌హెచ్ఎంఎస్‌పై అవగాహన

విశాలాంధ్ర-తాడికొండ : ఎల్‌హెచ్ఎంఎస్‌పై నిడుముక్కల గ్రామస్తులకు ఆదివారం స్థానిక సీఐ కె.వాసు అవగాహన కలిపించారు. గ్రామానికి చెందిన ఎవరైనా సుదూర ప్రాంతాలకు ప్రయాణ నిమిత్తం వెళితే సంబంధిత ఇంటి వివరాలను పోలీస్ స్టేషన్‌కు తెలియపరచాలని కోరారు. ఎల్‌హెచ్ఎంఎస్ ద్వారా మీ ఇంటికి భద్రత కల్పిస్తామన్నారు. నేడు దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్న నేపథ్యంలో గ్రామాలలోని అన్ని ప్రధాన సెంటర్లు, కూడళ్ళు, రహదారులలో నిఘా నేత్రాలను ఏర్పాటు చేసుకోవాలని గ్రామస్తులకు విజ్ఞప్తిచేశారు. ఎవరైనా చోరీకి పాల్పడితే తమకు వెంటనే సమాచారం వస్తుందని, చోరీకి పాల్పడే వ్యక్తిని అదుపులోకి తీసుకుంటామని తెలియజేశారు. కార్యక్రమంలో పలువురు ఎస్ఐలు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

చిట్టిబాబు జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-అవనిగడ్డ : తెలుగు దేశం మండలి పార్టీ అధ్యక్షుడు యాసం చిట్టిబాబు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం యాసం చిట్టిబాబు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని అవనిగడ్డలోని 3, 4 ,7 వార్డులతో పాటు తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో చిట్టిబాబు అభిమానులు కేకులు కట్‌చేసి, మిఠాయిలు పంచి శుభాకాంక్షలు తెలిపారు. శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ తనకార్యాలయంలో స్వచ్ఛంద సేవకులు తెలుగుదేశంపార్టీ మండల అధ్యక్షులు యాసం చిట్టిబాబు దివిసీమలో పెద్దఎత్తున రక్తదానశిబిరాల నిర్వహణతో రక్తదానానికి విస్తృత ప్రచుర్యం కల్పించి ఉమ్మడి రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న చిట్టిబాబును సత్కరించుకోవడం మన కర్తవ్యం అన్నారు. ఈ సందర్భంగా దుశ్శాలువా కప్పి చిట్టిబాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో కూటమి నేతలు, చిట్టిబాబు యూత్, అభిమానులు పాల్గొని డీఎస్పీ కార్యాలయం ఎదురుగా గల రవి మెకానిక్ షెడ్‌లో భారీగా టపాసులు పేల్చి, అభిమానులు ఏర్పాటుచేసిన కేకును కట్‌చేసి మిఠాయిలు పంచిపెట్టారు.

జనసేన ఆవిర్భావ సభను జయప్రదం చేయండి : గాదె

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: ఈ నెల 14వ తేదిన పిఠాపురం లో జరగబోయే జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవ సభకు రాష్ట్ర ప్రజలు అందరూ విచ్చేసి విజయవంతం చేయాలని జనసేన పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు కోరారు. ఆదివారం స్థానిక లాడ్జిసెంటర్‌లోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జనసేన పార్టీ చేసే ప్రతీ ఆలోచన, వేసే ప్రతీ అడుగు ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి కోసమేనన్నారు. ప్రజలకు మంచి జరిగే విషయంలో జనసేన రాజీ పడదని అన్నారు. రాష్ట్ర ప్రజలందరికీ ఇంటర్నెట్, కేబుల్ అందించాలి అని సదుద్దేశంతో 2015 లో గతంలో ఉన్న కూటమి ప్రభుత్వంలో ఏపీ ఫైబర్ నెట్ ఏర్పాటు చేయడం జరిగిందని, అప్పుడు ఉన్న ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేసి టెరాసాఫ్ట్ అనే కంపెనీ తో కలిసి సుమారు 10 లక్షల కనెక్షన్లు ఇవ్వడం జరిగిందని అన్నారు. కానీ గత ప్రభుత్వం ఈ సంస్థని పూర్తిగా విస్మరించి, వారి నాయకులకు దోచిపెట్టే ఆదాయ వనరుగా మార్చుకుందని విమర్శించారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ గతంలోనే అధికారులు తీరు మార్చుకోవాలని అని చాలా సార్లు చెప్పారు అని, కానీ చాలా మంది అధికారులలో మార్పు రాలేదన్నారు. ఈ నెల కూడా పద్ధతి లేకుండా జీతాలు ఇచ్చే విషయాన్ని తప్పు పట్టారు. అధికారులు తీరు మార్చుకుని ప్రజల పక్షాన పని చేయాలని లేదంటే రాజీనామా చేసి కాంట్రాక్ట్ చేసుకోవాలని సూచించారు. తీరు మార్చుకోకుంటే ఖచ్చితంగా తద్వారా వచ్చే పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు చందు సాంబశివరావు, జిల్లా ప్రచార కమిటీ కోఆర్డినేటర్ శిఖా బాలు, జిల్లా ఉపాధ్యక్షులు అడపా మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రొబేషనరీ ఎస్సైలకు నియామక ఉత్తర్వులు

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : శిక్షణ పూర్తి చేసుకున్న గుంటూరు రేంజ్ కింద ఎంపికైన ప్రొబేషనరీ ఎస్సైలు గుంటూరు రేంజ్ ఐజీ కార్యాలయంలో ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠిని ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఐజీ నూతనంగా పోలీస్ శాఖలోకి అడుగుపెడుతున్న ప్రొబేషనరీ ఎస్సైలకు హృదయ పూర్వక అభినందనలు తెలియజేశారు. విధి నిర్వహణలో నిర్భయంగా, నిష్పక్షపాతంగా, క్రమశిక్షణ, నిజాయతీ, పారదర్శకత, జవాబుదారీతనంతో పనిచేసి ప్రజలకు అత్యుత్తమ సేవలు అందించి పోలీస్ శాఖ పేరుప్రతిష్టలను ఇనుమడింపచేయాలని సూచించారు. గుంటూరు రేంజ్ పరిధి కింద 53(36 మంది మగ, 17 మంది ఆడ) మంది ఎస్సైలు ఎంపికై శిక్షణ పూర్తి చేసుకుని ఐజీను మర్యాద పూర్వకంగా కలవగా ఐజీ వారికి జిల్లాలను కేటాయిస్తూ నియామక ఉత్తర్వులను అందజేశారు. ఆయా జిల్లాల వారీగా కేటాయింపులు ఇలా... గుంటూరు-22 మంది, పల్నాడు-13 మంది, బాపట్ల-10 మంది, ప్రకాశం-01 మంది, నెల్లూరు-03 మంది, తిరుపతి-04 మంది ఉన్నారు. ఈ నెల 6వ తేది వరకు ప్రొబేషనరీ ఎస్సైలకు సెలవు మంజూరు చేసి తిరిగి 7వ తేది నుంచి గ్రేహౌండ్స్ శిక్షణ కోసం పంపించడం జరుగుతుందని ఐజీ తెలిపారు.

మసీదు నిర్మాణానికి శంకుస్థాపన

విశాలాంధ్ర - పర్చూరు : మండల కేంద్రమైన పర్చూరులో దాతల సహాయ సహకారంతో నూతనంగా నిర్మించనున్న మసీదుకు ఆదివారం శంకుస్థాపన గావించారు.గతంలో ఉన్న పాత మసీదులో వర్షాకాలంలో ప్రార్థన చేసుకోవడానికి ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో దాన్ని పడగొట్టి దాని స్థానంలో కొత్త మసీదు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.మసీద్ నిర్మాణ కమిటీ సభ్యులు,దాతలు,మత పెద్దలు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.మసీదు నిర్మాణం త్వరితగతిన పూర్తి కావాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరు తమకు చేతనైనంతా ఆర్థిక చేయూత అందజేయాలని మసీదు కమిటీ సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో మసీద్ ముతవల్లి షేక్ నబీసా,చీరాల మసీదు ముఫ్తీ హబీబుల్లా,నరసరావుపేట మౌలానా సాహిద్,మసీదు ఇమామ్,ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

పది విద్యార్థులకు పరీక్షా సామాగ్రి పంపిణీ

విశాలాంధ్ర-తెనాలి : అగాపే లవ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం తెనాలిలోని కోగంటి శివయ్య మున్సిపల్ హైస్కూలు విద్యార్థులకు, ఇంద్రనగర్, సుందరయ్య నగర్‌లోని 10వ తరగతి విద్యార్థులకు పరీక్షా సామాగ్రిని పంపిణీ చేశారు. ట్రస్ట్ సభ్యులు దేవ, మైఖేల్ పుట్టిన రోజు సందర్భంగా ఈ కార్యక్రమం జరిగింది. అగాపే లవ్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ పల్లికొండ రవికుమార్, కరివరపు పుల్లయ్య చేతుల మీదుగా పరీక్ష అట్ట, జామెంట్రీ బాక్సు, లాంగ్ స్కేలు, పెన్ను తదితర పరీక్ష సామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ, పదో తరగతి విద్యార్థులు బాగా చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణులై భవిష్యత్తులో స్థిరపడి కుటుంబానికి, సమాజానికి మేలు చేసే విధంగా తయారవ్వాలని కోరారు. ట్రస్ట్ సభ్యులు దేవ, మైఖేల్‌ల జన్మదినోత్సవం సందర్భంగా వారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్. పవన్, ఆశా కార్యకర్త బుల్ల, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

ఆకుల కుటుంబ సభ్యులకు సానుభూతి

విశాలాంధ్ర-అవనిగడ్డ : ఆకుల లంకమ్మ ప్రార్థివ దేహానికి వై.సి.పి యువనేత బడే గౌతమ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అవనిగడ్డ 2 వ వార్డుకు చెందిన ఆకుల సాయి, చింటు ల మాతృమూర్తి ఆకుల లంకమ్మ శనివారం రాత్రి మృతి చెందినది. ఆదివారం ఉదయం విషయం తెలుసుకున్న గౌతమ్ వారి నివాసానికి వెళ్ళి లంకమ్మ ప్రార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. గౌతమ్ వెంట పలువురు పాల్గొన్నారు.

ప్రశాంతంగా టైప్ రైటింగ్ పరీక్షలు

విశాలాంధ్ర - రేపల్లె : స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ రేపల్లె కేంద్రంలో ఆదివారం నిర్వ హించిన టైపురైటింగ్ పరీక్షలకు మొత్తం 40 మందికి గాను 39 మంది హాజరయ్యారని టైపు రైటింగ్ చీఫ్ సూ పరిండెంట్ ఎస్.చంద్రశేఖర్ చెప్పారు. మీడియాతో మాట్లాడుతూ ఇంగ్లీష్ లోయర్ గ్రేడ్ 21 మందికి గాను 20 మంది,ఇంగ్లీష్ హయ్యర్ గ్రేడ్‌కి 15 మంది,తెలుగు లోయర్ గ్రేడ్‌కి ఒక్కరూ తెలుగు హయ్యర్‌కి ముగ్గురు హాజరయ్యారని పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగాయని తెలిపారు.

ఊపిరితిత్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : మన శరీరానికి ఆక్సిజన్ అందిస్తూ మన శరీరంలోని కార్బన్ డయాక్సైడ్‌ని బయటికి పంపే విషయంలో ప్రముఖ పాత్ర వహించే ఊపిరితిత్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ చెస్ట్ ఫిజీషియన్ డాక్టర్ ఎస్.రఘు హెచ్చరించారు. స్థానిక అవగాహన సంస్థ కార్యాలయంలో అవగాహన సంస్థ ఆధ్వర్యంలో 'ఊపిరితిత్తులకు కలిగే అనారోగ్య సమస్యలు-తీసుకోవాల్సిన జాగ్రత్తలు'పై ఆరోగ్య సభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రఘు మాట్లాడుతూ ఊపిరితిత్తులు ఆరోగ్యంగా లేని సందర్భాల్లో శరీరంలోని అవయవాలకు సరైన ఆక్సిజన్ అందక మిగిలిన అవయవాలు దెబ్బతిని రకరకాల అనారోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. ధూమపానం, మద్యపానం వల్ల ఊపిరితిత్తులు అనారోగ్యానికి గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, ఇటీవల కాలంలో పెరుగుతున్న వాతావరణ కాలుష్యం కూడా అనారోగ్యానికి గల ముఖ్య కారణాలలో ఒకటని పేర్కొన్నారు. మద్యపానం, ధూమపానం లాంటి వ్యసనాలకు లోనవ్వకుండా మన చుట్టూ మంచి ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పాటు చేసుకుంటే చాలా మంచిదన్నారు. ముఖ్యంగా గాలి ద్వారానే ఊపిరితిత్తులకు వ్యాధులు సంక్రమించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, ఈ నేపథ్యంలో బయటకు వచ్చినప్పుడు మాస్క్ ధరించడం చాలా ఉత్తమమని తెలిపారు. గాలి ద్వారా వచ్చే సల్ఫర్, దుమ్ము, ధూళి, ఇతర క్యాన్సర్ కారకాలు శ్వాస నాళాల ద్వారా లోనికి ప్రవేశించి ఊపిరితిత్తులను అనారోగ్యానికి గురి చేస్తున్నట్లు చెప్పారు. మనం తీసుకునే గాలి పరిశుభ్రంగా, ఎక్కువ ఆక్సిజన్ ఉండే విధంగా చూసుకోవాలన్నారు. నెమ్ము సమస్యకు నేడు నిమోకోకల్ వ్యాక్సిన్ అందుబాటులో ఉందని, 60 సంవత్సరాల లోపు వారు ఈ వ్యాక్సిన్ రెండు పర్యాయాలు తీసుకోవాలని, 60 సంవత్సరాలు పైబడిన వారు ఒక డోస్ తీసుకుంటే సరిపోతుందన్నారు. టీబీ వ్యాధిని నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకమని, అప్రమత్తంగా ఉండి సరైన వైద్యాన్ని తీసుకుంటే ఆ ప్రమాదం నుంచి బయటపడొచ్చన్నారు. ఈ వ్యాధికి ప్రభుత్వం నుంచి ఉచితంగా మందులు, వైద్య పరీక్షలు, పోషకాహారం కోసం నగదును కూడా పొందవచ్చని, ఈ వ్యాధి సోకిన వ్యక్తి దగ్గినా లేదా తుమ్మిన ఆ తుంపర్ల ద్వారా కూడా ఇతరులకు టీబీ సోకుతుందని పేర్కొన్నారు. ఊపిరితిత్తులకు వ్యాధి సోకితే దగ్గు, దగ్గినప్పుడు కళ్ళే పడటం, రక్తం పడటం, చాతిలో నొప్పి, ఆయాసం, పిల్లి కూతలు వంటి లక్షణాలు కనబడతాయని, ఈ లక్షణాలు కనిపించిన వెంటనే డాక్టర్‌ను సంప్రదించి వైద్యం తీసుకున్నట్లయితే ఎలాంటి ప్రమాదం ఉండదన్నారు. ఈ ఆరోగ్య సభకు టీవీ సాయిరాం కోఆర్డినేటర్‌గా వ్యవహరించగా, ముప్పాళ్ళ ప్రసాదరావు, ఎన్.సాంబశివరావు, పాములరెడ్డి, ఆర్.రామచంద్రరావులు పాల్గొన్నారు.

ఆరోగ్య సభలో ప్రముఖ చెస్ట్ ఫిజిషియన్ డాక్టర్ రఘు

సిమెంట్ కర్మాగారంలో భద్రతా మాసోత్సవాలు

విశాలాంధ్ర- దాచేపల్లి : పెదగార్లపాడు లోని చెట్టినాడ్ సిమెంటు కర్మాగారంలో ఆదివారం జాతీయ భద్రతా మాసోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులకు వివిధ కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అందులో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్లాంట్ హెడ్ సీహెచ్ సీతారాములు, హెచ్ఆర్ హెడ్ బీవీఆర్ రాజు, సేఫ్టీ హెడ్ వెంకట్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

రాష్ట్ర బడ్జెట్‌పై నేడు రౌండ్ టేబుల్

విశాలాంధ్ర-దాచేపల్లి : రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై సోమవారం జన చైతన్య వేదిక గుంటూరు కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం జరుగుతుందని ప్రజా సంఘాల నాయకుడు కోలా నవజ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి దీనికి అధ్యక్షత వహిస్తారన్నారు. వక్తలుగా ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు జూపూడి రంగరాజు, జనసేన పార్టీ ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వర రావు, మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ నేత షేక్ మస్తాన్ వలీ హాజరవుతారని చెప్పారు. అన్ని ప్రజా సంఘాల నాయకులు, స్వచ్ఛంద సంస్థల నేతలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఆరోగ్యానికి ధ్యాన సాధనే దివ్య ఔషధం

విశాలాంధ్ర-దాచేపల్లి : నారాయణపురంలోని శ్రీ సుదర్శన పిరమిడ్ ధ్యాన కేంద్రం 15వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ప్రదర్శన నిర్వహించారు. దీనిలో భాగంగానే శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు 24 గంటల పాటు పిరమిడ్ కేంద్రంలో ధ్యానం చేశారు. ప్రధాన వీధుల మీదుగా సాగిన ఈ ప్రదర్శనలో ధ్యానం చేసే పద్ధతులు, దాని వలన కలిగే ప్రయోజనాలు, శాఖాహారంతో ఒనగూరే లాభాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ధ్యాన కేంద్రం నిర్వాహకురాలు బండ్ల లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

లోక కల్యాణార్థం జరిగే
మహా యాగం జయప్రదం చేయాలి

విశాలాంధ్ర - వినుకొండ : లోక కళ్యాణార్థం జరిగే అతిపెద్ద మహా యాగం జయప్రదం చేయాలని, అఖండ జ్యోతి ప్రదాత, నిత్య అన్నదాత పూజ్యశ్రీ హిమాలయ గురువులు పిలుపునిచ్చారు. మహాశివ రాత్రిని పురస్కరించుకొని వినుకొండ సమీపంలోని విఠంరాజు పల్లి సాయి బృందావనం చిన్న షిరిడిలో శాంతి ఆశ్రమం ట్రస్ట్ నిర్వహించిన మహాశివరాత్రి మహోత్సవ కార్యక్రమాన్ని దిగ్విజయం చేసినందుకు పూజ్య శ్రీ హిమాలయ గురుజీ అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. వినుకొండ విఠంరాజు పల్లి, సాయి బృందావనం ఆవరణలో నిర్వహించిన మీడియా సమావేశంలో పూజ్య శ్రీ హిమాలయ గురించి మాట్లాడుతూ. తక్కువ సమయంలో కార్యక్రమాన్ని తలపెట్టినప్పటికీ భక్తుల సహాయ సహకారాలతో పూజా కార్యక్రమాలు దిగ్విజయంగా పూర్తి నిర్వహించేందుకు సహకరించిన దాతలకు, భక్తులకు, సేవకులకు మంగళ శాసనాలు తెలిపారు. ఖర్చు విషయంలో అందుకు సంబంధించిన పూర్తి లెక్కలను మీడియా ముందు ఉంచారు. ప్రపంచ శాంతిని కోరుతూ లోక కళ్యాణార్థం తలపెట్టనున్న 12 సంవత్సరాల పాటు నిర్వహించి తలపెట్టిన" మహా యాగం" కార్యక్రమంను జయప్రదం చేసే దిశగా అందరు సహాయ సహకారాలు కావాలని, వినుకొండ ప్రాంతంలో ఈ యాగం నిర్వహించడం పై ఇప్పటికే అన్ని రంగాల వారితో చర్చలు జరుపుతున్నామని, చర్చలు అనంతరం మరోసారి సమావేశం నిర్వహించి యాగం ఎక్కడ, ఎప్పుడు, ఎలా అనే దానిపై పూర్తి వివరాలను వెల్లడిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శివశక్తి ఫౌండేషన్ జీవీ రమణ రావు, శాంతి ఆశ్రమ ట్రస్ట్ నిర్వాహకులు అధ్యక్షులు పెండ్యాల వెంకట మోహన్ రావు, కనిగండ్ల అనంత కోటేశ్వరరావు, పెండ్యాల కాశి, సుధాకర్, పెండ్యాల పుల్లారావు, మునిరెడ్డి తదితరులు పాల్గొని అన్నసంతర్పణం కార్యక్రమాన్ని నిర్వహించారు.

పేటను సందర్శించిన చెన్నై రోటరీ మహిళా సభ్యులు

విశాలాంధ్ర-చిలకలూరిపేట: మొక్కలు పెంచుదాం, పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం ముందు తరాలను గ్లోబల్ వార్మింగ్ నుంచి కాపాడుదాం అనే సంకల్పంతో చెన్నై రోటరీ క్లబ్ (మహిళలు) నుంచి బయలుదేరిన ముగ్గురు మహిళా సభ్యులు వివిధ ప్రాంతాలలోని రోటరీ క్లబ్‌లను కలుస్తున్నారు. అందులో భాగంగా నేపాల్ దేశం వరకు వెళ్లి తిరిగి వస్తూ రోటరీ క్లబ్ చిలకలూరిపేట సందర్శించారు. క్లబ్ ఆవరణలోని మంచినీటి ప్లాంట్, ఉచిత ఆరోగ్య కేంద్ర ను సందర్శించి, మొక్కలు నాటి, తదుపరి అడవుల పెంపకం వల్ల లాభాలు పర్యావరణం గురించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు ఆళ్ల వేమన రెడ్డి, మాజీ అధ్యక్షులు కాపు వెంకటరావు, తోటకూర వెంకటనారాయణ సభ్యులు కొల్లా శివప్రసాద్, కరణం వెంకట శివ, ధూళిపాల వెంకటరావు, పద్మమూడి మహేష్ తదితరులు పాల్గొన్నారు

జర్నలిస్టుకు ఎమ్మెల్యేల పరామర్శ

విశాలాంధ్ర-రెంటచింతల : స్థానిక సీనియర్ జర్నలిస్టు జి. కృష్ణమాచార్యులు సతీమణి పద్మావతి (60) ఆదివారం గుండెనొప్పితో మృతి చెందింది. వీరి అకాల మరణానికి మాచర్ల, గురజాల ఎమ్మెల్యేలు జూలకంటి బ్రహ్మారెడ్డి, యరపతినేని శ్రీనివాసరావు చరవాణి ద్వారా సంతాపం తెలిపారు.

11న బహిరంగ వేలం పాటలు

విశాలాంధ్ర-పెదకాకాని : పెదకాకాని శ్రీ మల్లేశ్వరస్వామి వారి దేవస్థానానికి సంబంధించి 2025-2026, 2026-2027 ఆర్థిక సంవత్సరాలకు
వివిధ లైసెన్సు హక్కులకు 2025 ఫిబ్రవరి 17న వాయిదా పడిన ఈ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు, సీల్డ్ టెండరు కమ్ బహిరంగ వేలం పాటలు తిరిగి ఈ నెల 11న ఆలయ ప్రాంగణంలో దేవదాయశాఖ అధికారుల పర్యవేక్షణలో నిర్వహించుట
జరుగునని ఆలయ ఉపకమిషనరు గోగినేని లీలాకుమార్ తెలిపారు. సదరు పాటలకు సంబంధించిన లైసెన్సు హక్కుల షెడ్యూల్స్‌ను ఈ నెల 8వ తేదీ నుంచి 10వ తేదీ వరకు కార్యాలయ పనివేళలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు
పొందవచ్చునని చెప్పారు. 11న ఉదయం 10 గంటల లోపు టెండరు షెడ్యూల్స్‌ను కార్యాలయంలో ఏర్పాటు చేసిన టెండర్ బాక్సులో షరతు నిబంధనలకు లోబడి దాఖలు చేయు అవకాశం కలదని ఆలయ ఉపకమిషనరు గోగినేని లీలాకుమార్ తెలిపారు.

పేకాడ డెన్‌పై దాడి

విశాలాంధ్ర-తాడేపల్లి : ఉండవల్లి సెంటర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో గుట్టు చప్పుడు కాకుండా జరుగుతున్న పేకాట డెన్‌పై తాడేపల్లి పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. రూ 54,130 నగదు స్వాధీనం
చేసుకున్నారు. విజయవాడ నగరం నుండి గాక చుట్టుపక్కల నుండి పెద్ద ఎత్తున ఇక్కడికి వచ్చి పేకాట ఆడుతున్నట్టు పోలీసులకు అందిన
సమాచారంతో దాడులు నిర్వహించారు. అదుపులోకి తీసుకున్న వారిని కోర్టుకు హాజరుపెడతామని తాడేపల్లి సిఐ కళ్యాణ్ రాజు తెలిపారు.

ఉమ్రా యాత్రికులకు ఘన వీడ్కోలు

విశాలాంధ్ర- దాచేపల్లి : పల్నాడులోని వివిధ ప్రాంతాలకు చెందిన ముస్లిం సోద రులు ఉమ్రా యాత్రకు పయనమయ్యారు. వారిలో దాచేపల్లికి చెందిన న్యాజ్ మొహిద్దీన్, అన్వర్ బాషాతో పాటు పెదగార్లపాడు తదితర గ్రామాలకు చెందిన 9 మంది సభ్యులు ఉన్నారు. తొలుత వారంతా దాచేపల్లిలోని మార్కస్ మసీదుకు చేరుకున్నారు. పవిత్ర రంజాన్ పర్వదినం సందర్భంగా అందరూ కలిసి మసీదులో ప్రత్యేక నమాజు చేశారు. అనంతరం ముఫ్తీ యూసుఫ్, షేక్ గోల్డ్ జానీబాషా, మహబూబ్ సుభానీతో పాటు తోటి ముస్లిం సోదరులు ఆత్మీయ ఆలింగనం చేసుకొని ఘనంగా వీడ్కోలు పలికారు.

ఉపవాసాల్లోకి ముస్లిం సోదరులు

విశాలాంధ్ర-దాచేపల్లి : ముస్లిం సోదరులకు పవిత్రమైన రంజాన్ నెల ఆదివారం ప్రారంభమైంది. శనివారం రాత్రి నెలవంక కనిపించడంతో ఈదుల్ ఫితర్‌గా పిలిచే ఈ పర్వదినాన్ని నెల రోజుల పాటు జరుపుకోనున్నారు. దీనిలో భాగంగానే ఆదివారం తెల్లవారుజాము నుంచే ఉపవాసాలు ప్రారంభమయ్యాయి. దాంతో మండే వేసవిని సైతం లెక్క చేయకుండా పిల్లలు, పెద్దలు, మహిళలు ఇలా ప్రతిఒక్కరూ కఠోర ఉపవాస దీక్షలు చేస్తున్నారు. మసీదులు, ఈద్గా స్థలాలను వాటి అభివృద్ధి కమిటీ సభ్యులు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. దాచేపల్లి, నడికూడి, ఇరికేపల్లి, నారాయణపురం సహా మిగతా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ఈద్గాలు, మసీదులను ప్రత్యేకంగా ముస్తాబు చేశారు.

అమ్మో... మేము అక్కడకు వెళ్లమండీ..

తహశీల్దార్ కార్యాలయమంటే భయపడుతున్న అధికారులు

విశాలాంధ్ర-దాచేపల్లి : మండలంలో ఉద్యోగం చేయడం అధికారులకు కత్తి మీద సాముయ్యింది. ఒకనాడు తొలుత వచ్చేందుకు భయపడతారు. ఆ తర్వాత వెళ్లడానికి ఇష్టం దరు. పదేళ్ల క్రితం నుంచి పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. రాజకీయం అధికార యంత్రాంగాన్ని శాసిస్తోంది. ఫలితంగా ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ నాయకుల మాట వినాల్సిందే. ఇది ఒక శాఖే కాదు అన్ని శాఖలు, కార్యాలయాలకు వర్తిస్తుంది. దీని ప్రభావంతో చేసేదేమీ లేక మనసులో మదనపడుతూ కొంత మంది అధికారులు తల వంచుకుని పోతున్నారు. నేతలు చేయమన్న పనులన్నీ చేయలేక మరికొంత మంది అధికారులు దీర్ఘకాలిక సెలవులు పెట్టుకొని కాలం గడుపుతున్నారు. లేకపోతే ఇంకో ప్రాంతానికి బదిలీ చేయించుకుంటున్నారు. దీనిలో భాగంగానే వివిధ కారణాలతో ఇక్కడి అధికారి ఒకరు సెలవుపై వెళ్లి, ఆ తర్వాత ఇంకో చోట విధుల్లో చేరారు. తాజాగా తహశీల్దార్ కార్యాలయం ఇన్‌చార్జ్ ఏలుబడిలో ఉంది. సిబ్బంది కొరత ఉంది. 11 రెవెన్యూ గ్రామాలకు సగం మంది వీఆర్వోలు కూడా లేరు. దాచేపల్లి, నడికూడిలో ఉన్న ఆరు సచివాలయాలకు ఆరుగురు వీఆర్వోల అవసరం ఉంది. అక్కడ కూడా అందరూ లేరు. తరచూ వచ్చే వివాదాలు పరిష్కరించుకుంటూ, నేర్పుతో మనగలిగితేనే ఇక్కడ రాణిస్తారు. మరీ ముఖ్యంగా రెవెన్యూ శాఖ విషయంలో పలు చోట్ల భూ వివాదాలు పెరిగిపోయాయి. ప్రభుత్వ భూముల ఆక్రమణ, ప్రైవేట్ స్థలాల కబ్జాలు, నకిలీ పాసు పుస్తకాలు, వాటి రిజిస్ట్రేషన్లు పుట్ట గొడుగుల్లా పెరిగాయి. వీటి మూలంగా తహశీల్దార్లకు తలనొప్పి తెచ్చి పెడుతున్నాయి. గతంలో పనిచేసిన వారిలో ఎంతో మంది ఎన్నో విధాలుగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఒకరిద్దరు అధికారులు అరెస్ట్ కూడా అయ్యారు. ఇన్నేసి కారణాలతో ఇక్కడకు రావడానికి కొత్త వారు ఎవరూ ఆసక్తి చూపడం లేదని తెలిసింది. ఇక్కడి పోస్టింగ్ కోసం నేతలకు నజరానాలిచ్చి వచ్చిన అధికారులు కూడా గతంలో ఉన్నారు. ఈ విషయం బహిరంగ రహస్యమే. ఇప్పుడు పరిస్థితులు మారి పోయి అన్నీ తల్లకిందులయ్యాయి. నేను రాను బిడ్డో ఆ దవాఖానాకు అన్నట్లు ఎవరూ ఇక్కడకు రావడానికి ఇష్టపడడం లేదు. ఫలితంగా విలువైన ఎన్నో రెవెన్యూ కార్యకలాపాలు స్తంభించిపోతున్నాయి. ప్రజలు, రైతులు, విద్యార్థులు ఇలా ఎంతో మంది కార్యాలయం చుట్టూ తిరగలేక ఇబ్బందిపడుతున్నారు. అదేవిధంగా మండల పరిషత్ కార్యాలయం, విద్యా శాఖ కార్యాలయం కూడా ఇన్‌చార్జ్‌ల ఏలుబడిలోనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో పర్మినెంట్ అధికారులను నియమించి ఇబ్బందులను తొలగించాలని జిల్లా యంత్రాంగాన్ని ప్రజలు కోరుతున్నారు.

జనసేన పార్టీ ఆవిర్భావ సభను విజయవంతం చేయాలి

విశాలాంధ్ర-చిలకలూరిపేట: జనచైతన్యమే జనసేన ఆశయమని, దగా పడ్డ పేదల పక్షాన నిలిచి వారి సమస్యలపై సాగించిన పోరుకు ఫలితంగానే జనసేన పార్టీకి అపూర్వ ఆదరణ లభిస్తోందని జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్ర కో-కన్వీనర్ పెంటేల బాలాజి చెప్పారు. ఆదివారం ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో బాలాజి మాట్లాడుతూ పిఠాపురంలో ఈ నెల 14న నిర్వహించే జనసేన పార్టీ ఆవిర్భావసభ ప్రతి ఒక్కరికీ పండుగ రోజని, ఈ సభను విజయవంతం చేయటానికి ప్రతి జనసైనికుడు, వీర మహిళ శక్తి వంచన లేకుండా కృషి చేయాలని పిలుపు నిచ్చారు.

ఓ ఇంట్లో ప్రత్యక్షమైన అరుదైన జంతువు

భయాందోళనకు గురైన స్థానికులు

విశాలాంధ్ర-తాడేపల్లి: తాడేపల్లిలో అరుదైన పిల్లి జాతి జంతువు ప్రత్యక్షమైంది. తాడేపల్లి కొండపై నుంచి ముగ్గురోడ్డులోని గొట్టిముక్కల లాజర్ అనే వ్యక్తి ఇంట్లోకి ఆ వింత జంతువు పిల్లి ప్రవేశించింది. ఆ జంతువు కళ్లు చూస్తే అచ్చం పిల్లి కళ్ల వలే ఉన్నాయి. దాని తోక పొడవుగా ఉంది. నలుపు రంగులో ఉంది.ఈ క్రమంలో పిల్లిని చూసిన స్థానికులు ఒక్కసారిగా భయభ్రాంతులకు గురయ్యారు. పలువురు అక్కడికి చేరుకున్న అనంతరం దానిని చాకచాక్యంగా బంధించి అటవీశాఖ అధికారులకు సమాచారమిచ్చారు. వెంటనే అటవీశాఖ అధికారులు ఘటన స్థలానికి చేరుకున్నారు. ఇది చాలా అరుదైన జీవి అని, ఆఫ్రికా అడవుల్లో సంచరించే సివర్ట్ జాతికి చెందిన పిల్లిగా అధికారులు గుర్తించారు. అనంతరం పిల్లికి ఆస్పత్రుల్లో వైద్య పరీక్షలు నిర్వహించి అడవిలో విడిచిపెడతామని వారు తెలిపారు.

రేపు సబ్ జూనియర్ బాలబాలికల కబడ్డీ ఎంపికలు

విశాలాంధ్ర - బాపట్ల : 34వ గుంటూరు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సబ్ జూనియర్ బాలబాలికల కబడ్డీ సెలక్షన్స్ మంగ ళవారం బాపట్ల మున్సిపల్ హై స్కూల్ క్రీడా ప్రాంగణంలో సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి మంతెన సుబ్బరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సెలక్షన్స్‌లో పాల్గొనే క్రీడాకారులు 2009 మార్చి 30తరువాత పుట్టి ఉండవలని,ప్రతి ఒక్కరూ ఆధార్ కార్డు తీసుకొని రావలని,అలాగే బాల బాలికలు 55 కేజీల లోపు ఉండలన్నారు. సెలక్షన్స్ మంగళవారం మధ్యాహ్నం 2 గంటల నుండి జరుగుతుందని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు అంతర్ జిల్లాల పోటీల్లో ఉమ్మడి జిల్లా తరపున పాల్గొంటారని తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

విశాలాంధ్ర-చీమకుర్తి : చీమకుర్తి మండ లం చంద్రపాడులో పొలాల్లో జోగులా డుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు చీమకుర్తి సీఐ సుబ్బారావు తెలిపారు. ఆరుగురి వద్ద నుంచి రూ 24250 స్వాధీనం చేసుకుందా మన్నారు. అసాంఘిక కార్యకలా పాలకు పాల్ప డితే చర్యలు తప్పుకొని సిఐ హెచ్చరించారు.

వ్యాపార వర్గాలకు కూటమి ప్రభుత్వం అండ: పెమ్మసాని

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: వ్యాపార వర్గాలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి, గుంటూరు ఎంపీ డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. ది ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్, గుంటూరు నూతన అధ్యక్షు లుగా ఎన్నికైన ఏల్చూరి వెంకటేశ్వర్లు సన్మాన సభ స్థానిక వెంకటేశ్వర విజ్ఞానమందిరంలో ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన పెమ్మసాని మాట్లాడుతూ సాయం కోసం వచ్చిన వారికి స్నేహ హస్తం, వ్యాపార, రాజకీయాల్లో స్వర్ణ అనుభవం, మాట నిలబెట్టుకునే నైజం కలిగిన వ్యక్తి వెంకటేశ్వర్లు అని ఈ రోజు ఇంతమంది సన్మానించుకునే స్థాయికి ఏల్చూరు వెంకటేశ్వర్లు చేరుకున్నారని అన్నారు. సన్మానం అంటే కేవలం సత్కారం మాత్రమే కాదు బాధ్యత అని మరచిపోకూడదన్నారు. చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులందరూ కలిసి సమిష్టి నిర్ణయం తీసుకుని చిన్న చిన్న వ్యాపారులకు బ్యాంకు రుణాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి చాంబర్ ఆఫ్ కామర్స్ కీలకపాత్ర పోషించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మహమ్మద్ నసీర్, గల్లా మాధవి, కన్నా లక్ష్మీనారాయణ, బూర్ల రామాంజనేయులు, తెనాలి శ్రావణ్ కుమార్, ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డేగల ప్రభాకర్, ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహన్ కృష్ణ, క్రేన్ సంస్థ అధినేత గ్రంధి కాంతారావు, కార్పొరేటర్లు ఈరంటి వరప్రసాద్, పోతురాజు సమత, తెలుగు వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్తూరు వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

నూరు శాతం ఆస్తి పన్ను వసూళ్లు జరగాలి: కమిషనర్

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ఆస్తి పన్ను నూరు శాతం వసూళ్లు జరగాల్సిందేనని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం సెట్ కాన్ఫరెన్స్ ద్వారా డిప్యూటీ కమిషనర్లు, రెవెన్యూ అధికారులు, ఇన్‌స్పెక్టర్లు, అడ్మిన్ కార్యదర్శులకు స్పష్టం చేశారు. మార్చి నెల ప్రారంభమైనందున రెవెన్యూ విభాగ ప్రతి అధికారి పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పన్ను బకాయి ఉన్న ప్రైవేట్ ఆస్తుల్లో రూ.165 కోట్లకు ఇప్పటివరకు రూ.90 కోట్లు వసూళ్లు జరిగిందని, మార్చి చివరికి మరో రూ.50 కోట్లు వసూళ్లు చేయాలన్నారు. పన్ను వసూళ్లకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, రెవెన్యూ అధికారి, డిప్యూటీ కమిషనర్ల వారీగా రోజువారీ లక్ష్యాన్ని నిర్దేశించామని, అందుకు తగిన విధంగా క్షేత్ర స్థాయిలో వసూళ్లు జరగాలన్నారు. పెద్ద మొత్తంలో బకాయిలు ఉన్న వాటికి డిప్యూటీ కమిషనర్లు భాధ్యత తీసుకోవాలని, పన్ను వసూళ్లు అధిక ప్రాధాన్యత అయినందున విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గుంటూరు నగర ప్రజలు తమ ఆస్తి, ఖాళీ స్థల, నీటి కుళాయి చార్జీలను సకాలంలో చెల్లించాలని, తద్వారా నగరంలో అభివృద్ధి పనులు వేగంగా జరిగేందుకు వీలు కల్గుతుందన్నారు. ఇప్పటికే 2024-25 రెండవ అర్ధ సంవత్సరం చివరికి వచ్చామని, నెలాఖరు వరకు వేచి ఉండకుండా నగరపాలక సంస్థకు బకాయిలు మొత్తం చెల్లించాలని, ఏప్రిల్ 1 నుంచి పన్నుపై నెలకు రూ.100కు రూ.2 వడ్డీ జమ అవుతుందన్నారు. మార్చి నెలలో సెలవు రోజుల్లో కుడా క్యాష్ కౌంటర్లు యధావిధిగా పనిచేస్తాయని, పన్నులను జీఎంసీ ప్రధాన కార్యాలయం, సర్కిల్ కార్యాలయల్లోని క్యాష్ కౌంటర్లతో పాటుగా, భారత్‌పేటలోని 140వ సచివాలయంలోని క్యాష్ కౌంటర్లలో చెల్లించవచ్చన్నారు. నగరపాలక సంస్థకు చెల్లించవలసిన ఆస్తి పన్ను, నీటి పన్ను, ఖాళీ స్థలం పన్ను, నీటి మీటర్ చార్జీలు, డీ అండ్ ఓ ట్రేడ్ లైసెన్స్‌లు చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలని కోరారు.

సాంకేతిక పరిజ్ఞానంతో విజిబుల్ పోలీసింగ్

విశాలాంధ్ర-మంగళగిరి : ఆధునిక పరిజ్ఞానంలో భాగంగా డ్రోన్ కెమెరాలతో ఆదివారం మంగళగిరి మండలం కాజ గ్రామ పరిధిలోగల టోల్ ప్లాజా వద్ద విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా మంగళగిరి గ్రామీణ ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్ వాహనాల తనిఖీని చేశారు. డ్రోన్ కెమెరాల సహాయంతో అతివేగంగా నడిపే వాహనాలను, ఖాళీ ప్రదేశాల్లో మద్యం సేవించే వ్యక్తులను పేకాట, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులను పట్టుకొనుటకు డ్రోన్ కెమెరాలు సహాయపడతాయని ఎస్ఐ వెంకట్ అన్నారు. డ్రోన్ కెమెరాల సహాయంతో ఎక్కువగా ఉంటుందని, ఈ నేపద్యంలో మండల ప్రజలందరూ ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకూడదని ఎస్సై చిరుమామిళ్ల వెంకట్ హెచ్చరించారు.

గుర్తు తెలియని మృతదేహం

విశాలాంధ్ర-తాడేపల్లి : నులకపేట ఐఓసీ పెట్రోల్ బంక్ సమీపంలో రోడ్డు పక్కన సుమారు 70 సంవత్సరాలు వయసు గల గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహం పడి ఉంది. మృతదేహాన్ని మంగళగిరి ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం కోసం తరలించారు. తాడేపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కూటమి ప్రభుత్వంలోను కాపులపై నిర్లక్ష్యం

విశాలాంధ్ర-అవనిగడ్డ : గత వై.సి.పి ప్రభుత్వంలో మాదిరిగానే కూటమి ప్రభుత్వంలో కూడా కాపులు నిర్లక్ష్యానికి గురవుతున్నారు. గత వై.సి.పి ప్రభుత్వం కాపులను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. ఒక రకంగా చెప్పాలంటే కాపులను వర్గ శత్రువులుగా భావించింది. ఈ నేపథ్యంలో కాపులంతా వై.సి.పి ప్రభుత్వ తీరును నిశితంగా గమనించి వై.సి.పి ఓటమికి ఎనలేని కృషిచేసి కూటమి ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకొచ్చారు. కానీ కూటమి ప్రభుత్వం వారు తెలగ, బలిజ. ఒంటరి కులాల వారి ప్రయోజనాలను కాపాడే విధంగా ఇంతవరకు ప్రత్యేకంగా ఏవిధమైన చర్యలు తీసుకోలేదు. కూటమి ప్రభుత్వం వారు అన్ని కులాల కార్పొరేషన్‌లకు కూటా నిధులు కేటాయించారు. ఆవిధంగా కాపు కార్పొరేషన్ కూడా నిధులు కేటాయించారుకాని ప్రత్యేకంగా కాపులకంటూ చేసిందేమీ లేదు. క్షత్రీయ సేవా సమితి విజ్ఞప్తి మేరకు భోగాపురం అంతార్జాతీయ విమాన శ్రయానికి అల్లూరి సీతారామరాజు పేరు నామకరణం చేస్తున్నట్లు కూటమి ప్రభుత్వం ప్రకటించింది. గత వై.సి.పి ప్రభుత్వం కూడా అల్లూరి సీతారామరాజు పేరుమీద ఒక జిల్లా ను ఏర్పాటు చేశారు. కానీ స్వాతంత్ర్య సమరయోధులైన కన్నెగంటి హనుమంతు విషయంలో కూటమి ప్రభుత్వం నేటి వరకు స్పందించలేదు. ఆనాటి బిజెపి రాష్ట్ర అధ్యక్షులు నేటి టి.డి.పి ఎమ్ఎల్ఏ కన్నా లక్ష్మీనారాయణ పల్నాడు జిల్లాకు కన్నెగంటి పనుమంతు పేరు పెట్టాలని డిమాండ్ చేసియున్నారు. ఆడిమాండ్ పట్ల కూటమి ప్రభుత్వం నేటి వరకు స్పందించలేదు. స్వాతంత్ర్య సమర యోధులైన కన్నెగంటి హనుమంతుపట్ల, కాపుకులం పట్ల పాలకులు కుల వివక్ష చూపిస్తున్నారనే దానికి ఇదొక బలమైన ఉదాహరణగా చెప్పవచ్చు. మచిలీపట్నం కేంద్రంగా ఉన్న కృష్ణాజిల్లాకు వంగవీటి మోహనరంగా పేరు పెట్టాలని వై.సి.పి ప్రభుత్వ కాలంలో అన్ని కాపు సంఘాల వారు కోరినప్పటికీ కూడా ఆ ప్రభుత్వం డిమాండ్‌ను పరిగణలోనికి తీసుకోలేదు. అదే సందర్భంలో ఆనాటి మాజీ ఎం.ఎల్.ఎ టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు బొండా ఉమామహేశ్వరరావు కృష్ణాజిల్లాకు రంగా పేరును నామకరణంచేయాలంటూ నిరాహారదీక్ష చేసి పోరాటం చేశారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

O.S NO : 172/2022

బిట్వీన్ :
పోలిశెట్టి మురళి - వాది
వర్సెస్
తిరుపీధి గురివిశెట్టి - ప్రతివాది

TO,
తిరుపీధి గురివిశెట్టి, తండ్రి సుబ్బారావు (లేటు), 46 సం.లు, దాల్ బిజినెస్, R/O. వినాయక టెంట్ హౌస్ వీధి, రామాటాకీసు లైను, మాచర్ల టౌన్ మరియు మండలం, పల్నాడు జిల్లా.

పై నెంబరు దావాలో శ్రీ కోర్టు వారు నీకు ఎన్నిమార్లు సమన్లు పంపినను, తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు వాయిదా **ది.3-4-2025కు** నీయొక్క హాజరు నిమిత్తం వేసినారు. కావున నీవు పై తేదీన పై కోర్టులో **ఉదయం 10:30 గంటలకు** స్వయంగా గాని, వకీల్ ద్వారా గాని, హాజరై నీకు ఆక్షేవణలను తెలియజేసుకొనవలసింది. లేనియెడల కేసును నీ వరోక్షముగా తీర్మానించబడునని, ఇందుమూలంగా తెలియజేయడమైనది.

వాయిదా తేదీ. 3-4-2025.

జె. నాగేశ్వరరావు, బికాం, బిఎల్.
వాది తరపు న్యాయవాది, రామ టాకీస్ దగ్గర,
మాచర్ల. సెల్ : **9440450973.**

వేలం ప్రకటన

మహారాజశ్రీ మాచర్ల ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జికోర్టు

E.P : 34/2017, O.S: 29/2010

బిట్వీన్
మాగులూరి రామారావు - D.H.R/డి.హెచ్.ఆర్.
వర్సెస్
1. కపలవాయి వెంకటసుబ్బయ్య (DIED)
మరియు ఇతరులు - **J.D.R/జె.డి.ఆర్.**

జె.డి.ఆర్ లుకు చెందిన ఈ దిగువ షెడ్యూలు దాఖల ఆస్తిని **ది.18-3-2025 తేదీన** పై కోర్టులో బహిరంగ వేలం జరుపబడును. కావలసిన వారు పై కోర్టులో పై తేదీన హాజరు అయి, బహిరంగ వేలంలో పాల్గొన వలసిందిగా, ఇందు మూలంగా తెలియజేయుటమైనది.

షెడ్యూలు : దుర్గి గ్రామ మెయిన్ రోడ్డు లోని మద్రాసు టెర్రిసుడుతో నిర్మించిన **అసెస్మెంట్** నెం : **607,** డోర్ నెం : 4-7గా గల నాలుగు సెంట్ల ఇంటికి **హద్దులు: తూర్పు:** పలుచూరి నాగేశ్వరరావు ఇల్లు **దక్షిణం :** బలుసు నారాయణ గారి ఇల్లు **పడమర :** బజారు, **ఉత్తరం :** పలుచూరి నాగేశ్వరరావు ఇల్లు.

డి.హెచ్.ఆర్ విలువ : 1,00,000/-
అమీనా విలువ : 3,50,000/-
వేలం తేది : 18-3-2025
ఫరదర్ హియరింగ్ : 25-3-2025.

జె. నాగేశ్వరరావు, బికాం, బిఎల్.
డి.హెచ్.ఆర్. తరపు న్యాయవాది,
మాచర్ల. సెల్ : **9440450973.**

వేలం ప్రకటన

మహారాజశ్రీ మాచర్ల ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జికోర్టు

E.P : 36/2019, O.S: 323/2016

బిట్వీన్ :
మెస్సర్స్ లింగమల్లు సిల్క్స్ విజయవాడ - డి.హెచ్.ఆర్.
వర్సెస్
1. విఘ్నేశ్వర షాపింగ్ మాల్, మాచర్ల రిప్రజెంటెడ్ బై ఇట్స్ ప్రొప్రైటర్ : షేక్ సైదా.
2. షేక్ సైదా - జె.డి.ఆర్.

జె.డి.ఆర్‌కు చెందిన ఈ దిగువ షెడ్యూలు దాఖల ఆస్తిని **ది.18-3-2025 తేదీన** పైకోర్టు లో బహిరంగవేలం జరుపబడును. కావలసిన వారు పైకోర్టులో పై తేదీన హాజరు అయ్యి, బహిరంగ వేలంలో పాల్గొనవలసిందిగా, ఇందుమూలంగా తెలియజేయుటమైనది.

షెడ్యూలు: ఐటమ్ నెం.1 : మాచర్ల 15వ బ్లాక్, నెహ్రూ నగర్ ఒకటవ లైన్‌లో సర్వే నెం : **388/1 లోని,** డోర్ నెం : 15-1-398కు దక్షిణం వైపు గల 242 చదరపు గజాలకు, ఖాళీ స్థలంకు **హద్దులు: తూర్పు:** షేక్ రఫీ తాలుకు ఆస్తి, **దక్షిణం:** షేక్ మస్తాన్ వలి తాలుకు ఆస్తి, **పడమర:** బజారు ఉత్తరం షేక్ ఇబ్రహీం తాలూకు ఆస్తి.

డి.హెచ్.ఆర్ విలువ : 3,00,000/-
అమీనా విలువ : 5,00,000/-

ఐటమ్ నెం-2 : మాచర్ల 15వ బ్లాక్, నెహ్రూ నగర్ ఒకటవ లైన్‌లో సర్వే నెం : 388/1 లోని, డోర్ నెం : 15-1-398కు దక్షిణం వైపు గల 242 చదరపు గజాలకు, ఖాళీ స్థలంకు **హద్దులు: తూర్పు:** మంజుల వెంకటేశ్వర్లు తాలూకు ఆస్తి
దక్షిణం : డి యాలద్రిక తాలుకు ఆస్తి, **పడమర:** బజారు, **ఉత్తరం :** షేక్ రఫీ తాలుకు ఆస్తి.

డి.హెచ్.ఆర్ విలువ : 3,00,000/-
అమీనా విలువ : 5,00,000/-
వేలం తేది : 18-3-2025
ఫరదర్ హియరింగ్ : 25-3-2025.

జె. నాగేశ్వరరావు, బికాం, బిఎల్.
డి.హెచ్.ఆర్. తరపు న్యాయవాది,
మాచర్ల. సెల్ : **9440450973.**

అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకోవాలి

విశాలాంధ్ర-చిలకలూరిపేట: అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకోవాలని, అగ్రిగోల్డ్ ఆస్తులను పరిరక్షించాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె.మంత్రు నాయక్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావును కలసి అసోసియేషన్ నాయకులతో కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్రిగోల్డ్ కంపెనీ యాజమాన్యం 8 రాష్ట్రాలలోని 32 లక్షలమంది నుండి పలు స్కీముల పేరుతో ప్రత్యక్షంగా రూ.6,380 కోట్లను డిపాజిట్ల రూపంలో సేకరించిందని వెల్లడించారు. మన రాష్ట్రంలో 19.52 లక్షలమంది నుండి 3,986 కోట్లను సమీకరించిందని వెల్లడించారు. ఒక్కొక్కరు వందల కోట్లు వ్యక్తిగత ఆస్తులుగా కుటుంబ సభ్యుల పేర, బినామీల పేరున పెద్దమొత్తాలను దాచుకుని కంపెనీ బోర్డు తిప్పేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సమర్ధవంతమైన అధికారుల బృందం తో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి, బాధితులకు న్యాయం చేయాలని, బినామీ ఆస్తులను, కుటుంబ సభ్యుల పేర వున్న ఆస్తులను జప్తు చేయించాలని కోరారు. అగ్రిగోల్డ్ కేసుల సత్వర పరిష్కారానికి ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటుచెయ్యాలన్నారు. జప్తు చేసిన ఆస్తుల రక్షణ బాధ్యతను సి.ఐ.డి చీఫ్ పర్యవేక్షణలో మండల రెవెన్యూ, పోలీసు అధికారులకు అప్పగించి కాపాడాలని, యాజమాన్యం దోచుకున్న ఆస్తులను రికవరీ చేయించాలన్నారు. అగ్రిగోల్డ్కు చెందిన భూముల వాస్తవ స్థితిని బట్టి చిన్న సేద్యపు కమతాలుగాను, ఇండ్ల స్థలాలకు పనికివచ్చే వాటిని చిన్న చిన్న ప్లాట్లుగాను వేసి బయటి కొనుగోలుదారులకు బహిరంగ వేలం ద్వారా విక్రయించాలన్నారు. అత్యవసర వైద్యం, విద్య, బిడ్డల పెళ్లిళ్ళు లాంటి అవసరాలు ఉన్నవారికి, లక్షలోపు డిపాజిట్ చేసిన చిన్న పొదుపుదారులకు తక్షణ చెల్లింపులకు తగిన ఏర్పాట్లుచేసి మరో డిపాజిట్దారుడు బలికాకుండా ఆదుకోవాలని కోరారు. ఈ అంశాలను సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్లి తగు విధంగా న్యాయం చేయటానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు జంపని హనుమంతరావు, అంజని దేవి, కె కోటేశ్వరమ్మ, సీతారామయ్య, షేక్. మౌలాలి, టి పవనకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రత్తిపాటికి అసోసియేషన్ నాయకులు వినతి

వంతెన నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే నసీర్

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: గుంటూరులో నిర్మాణం లోని ఉన్న మూడు వంతెన నిర్మాణ పనులను ఆదివారం గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో ఇప్పటి వరకు జరిగిన పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణాల్లో నాణ్యతకు రాజీపడొద్దని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గుంటూరు నగరాభివృద్ధికి మాస్టర్ ప్లాన్ ప్రకారం పనులు చేపడుతున్నామని తెలిపారు. ఆర్వోబీల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వ సహకారంతో పనులు చేపట్టామని చెప్పారు. ఈ పనులు పూర్తయితే గుంటూరులో ట్రాఫిక్ సమస్య పరిష్కారమవుతుందని అన్నారు. పనులు పురోగతిని పరిశీలించామని, వేగవంతంగా పూర్తి చేసేందుకు ఆదేశాలిచ్చామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే వెంట సంబంధిత అధికారులు, పార్టీ నాయకులు ఉన్నారు.

సైన్స్ ఎగ్జిబిషన్లో విద్యార్థుల ప్రతిభ



విశాలాంధ్ర-మంగళగిరి : జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళగిరి పట్టణంలో వివేకానంద విద్యాలయంలో సైన్స్ ఎగ్జిబిషన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వివేకానంద విద్యాలయంలో ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్లో విద్యార్థినీ, విద్యార్థులు చేసిన ప్రాజెక్టులను స్మార్ట్ సిటీ, డ్యాం, డైజెస్టివ్ సిస్టం, హైడ్రో ఎలక్ట్రిసిటీ, యానిమల్ హబిటేషన్స్, ఫుడ్ అండ్ న్యూట్రిషన్, వివిధ రకములైన ప్రాజెక్టులను చూసి తల్లిదండ్రులు, స్కూల్ యాజమాన్యం విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ సైన్స్ అనేది మన రోజువారి జీవితంలో కీలకపాత్ర పోషిస్తుంది. సర్ సివి రామన్ చేసిన అపారమైన సేవలకు గుర్తింపుగా జాతీయ సైన్స్ దినోత్సవంను జరుపుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ యాజమాన్యం, తల్లిదండ్రులు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

నకిలీ పోలీస్ హల్చల్

విశాలాంధ్ర-తాడేపల్లి: సిమెంట్ ఫ్యాక్టరీలో నకిలీ పోలీస్ ఆదివారం హల్చల్ చేశాడు. సుమారు 30 సంవత్సరాలు ఉన్న యువకుడు మద్యం సేవించి, తాను పోలీస్ డిపార్ట్మెంట్ అని, తనకు కొంత డబ్బులు ఇవ్వాలని స్థానికులను డిమాండ్ చేశారు. కొంతమంది అతను అడిగిన అమౌంట్ను సమర్పించుకున్నారు. అతని వాలకం, మాట్లాడుతున్న తీరు చూసి పెద్ద ఎత్తున ప్రజలు పోగై తనని నిలదీశారు. పోలీస్ డిపార్ట్మెంట్ ఇచ్చిన ఐడి కార్డ్ చూపించమని అడిగారు. పరిస్థితి విషమిస్తుందని, ప్రజలందరూ తిరగుబాటు చేస్తారని ఊహించి తాను అసలు పోలీసు కాదని ఒప్పేసుకున్నాడు. స్థానికులు తాడేపల్లి పోలీసులకు సమాచారం అందించారు. కేసు విచారిస్తున్నారు.

ఇంటి స్థలంతో పాటు

నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలి: సీపీఐ

విశాలాంధ్ర-మంగళగిరి : నిరుపేద ప్రజలకు ఇళ్ల స్థలాలతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని సీపీఐ నాయకులు కోరారు. మంగళగిరి మండలం నవులూరు గ్రామంలోని మక్కేవారిపేటలో ఇళ్ళు లేని నిరుపేద ప్రజలకు పట్టణాలలో రెండు సెంట్లు, గ్రామాలలో మూడు సెంట్లు ఇవ్వాలని కోరుతూ అర్జీలను పూర్తిచేసే కార్యక్రమాన్ని ఆదివారం సీపీఐ నాయకులు చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్లు మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. పేద ప్రజలకు పట్టణాలలో రెండు సెంట్లు, గ్రామాలలో మూడు సెంట్లు ఇచ్చి వారికి ఇంటి నిర్మాణానికి ఐదు లక్షలు ఇవ్వాలని, కొండపోరంబోకు స్థలాలలో నివసిస్తున్న పేద ప్రజలకు ఇళ్లపట్టాలను మంజూరు చేయాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి నందం బ్రహ్మేశ్వర రావు, 17వ వార్డు శాఖ కార్యదర్శి గండికోట దుర్గారావు, పాలెం నాసరయ్య తదితరులు పాల్గొన్నారు.

నేరప్రవృత్తిని విడనాడాలి: డీఎస్పీ

విశాలాంధ్ర-మంగళగిరి : రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని, ఎలాంటి గొడవలకు, భూదందాలకు పాల్పడకూడదని నార్త్ సబ్ డివిజన్ డీఎస్పీ మురళీకృష్ణ హెచ్చరించారు. ఆదివారం మంగళగిరి గ్రామీణ పోలీస్ స్టేషన్ ఆవరణలో రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని, అలాగే గ్రామీణ ప్రాంతాలలో విద్వేషాలు సృష్టించకుండా ఉండాలని, అన్ని వివాదాలకు దూరంగా ఉండాలని డీఎస్పీ హెచ్చరించారు. ప్రజలను భయాందోళనకు గురిచేస్తే అలాకాకుండా గొడవలు సృష్టించి పీడీ యాక్ట్ కేసులు నమోదు చేస్తామని ఆయన రౌడీషీటర్లను హెచ్చరించారు. గ్రామీణ ప్రాంతాలలో ఎవరైనా రౌడీషీటర్లు, రౌడీయిజానికి పాల్పడినట్లయితే గ్రామీణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ మురళీకృష్ణ గ్రామ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి గ్రామీణ ఎస్సై చిరుమామిళ్ల వెంకట్, ఎస్సై మహేష్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వెనిగళ్ల సూర్యకుమారికి నివాళి



విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : విజయవాడ నగరంలోని ప్రముఖ విద్యా సంస్థ శ్రీ గోసలైట్స్ మెడికల్ అకాడమీ చైర్మన్ నరేంద్ర బాబు మాతృమూర్తి వెనిగళ్ళ సూర్యకుమారి నివాళి కార్యక్రమం మంగళగిరి పట్టణంలోని సీకే కన్వెన్షన్లో ఆదివారం జరిగింది. నగర ప్రముఖులు, విద్యావేత్తలు, బంధుమిత్రులు, శ్రీ గోసలైట్స్ సిబ్బంది తదితరులు వెనిగళ్ళ సూర్యకుమారి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, ఘన నివాళి సమర్పించారు. వారి ప్రేమాభిమానాలను మంచితనాన్ని కొనియాడుతూ, వారితో తమకున్న అనుబంధాన్ని మధుర స్మృతులను గుర్తుచేసుకున్నారు. వారి కుటుంబానికి సంతాపం తెలియజేసారు. గుంటూరు జిల్లా, దోనేపూడి గ్రామంలో, 1941 అక్టోబర్ 10వ తేదీన వీరమాచినేని సత్యనారాయణ చౌదరి, మంగమ్మ పుణ్య దంపతులకు జన్మించిన వెనిగళ్ల సూర్యకుమారి చదువుల్లో చక్కగా రాణించి, ఆ రోజుల్లోనే పీయూసీ ఉత్తీర్ణులయ్యారు. 1957 మే 19వ తేదీన వెనిగళ్ల పార్థసారధిని వివాహమాడి అన్యోన్య దాంపత్యం సాగించి ఆదిదంపతులకు మారుపేరుగా నిలిచారు. తన పర బేధం లేకుండా, చిన్నా పెద్దా తారతమ్యం లేకుండా బంధుమిత్రులందరికీ ప్రేమాభిమానాలను పంచే వారు. తన మంచితనాన్ని అందరికీ పంచి, మంచికి మారుపేరుగా వేనోళ్ళ కొనియాడబడి, అందరి హృదయాల్లో సుస్థిర నివాసం ఏర్పరుచుకున్న మాతృమూర్తి వెనిగళ్ల సూర్యకుమారి చిరస్మరణీయులు.

పల్నాడు అభివృద్ధికి కృషి: ఎమ్మెల్సీ

విశాలాంధ్ర-రెంటచింతల : వరికెసెలపూడి ప్రాజెక్టు నిర్మాణం పూర్తయ్యే వరకు కృషి చేస్తానని ఎమ్మెల్సీ కెవెస్ లక్ష్మణరావు అన్నారు. స్థానిక సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాలలో ఆదివారం జరిగిన రెంటచింతల ఉపాధ్యాయిని డాక్టరు ఎంబి చిన్నమ్మ పదవీ విరమణ సన్మాన సభలో పాల్గొన్నారు. పల్నాడు అక్షరాస్యత, అభివృద్ధిలో వెనుకంజలో ఉందన్నారు. మాచర్లలో పీజీ కేంద్రం, రెంటచింతలలో జడ్పీ ఉన్నత పాఠశాల ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. 60 శాతం అక్షరాస్యత ఉన్న పల్నాట చిన్నమ్మ లాంటి ఉత్తమ టీచర్ల సేవలను ప్రభుత్వం సద్వినియోగం చేసుకుంటే అక్షరాస్యత శాతం పెరుగుతుందన్నారు. అనంతరం మండలంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు చిన్నమ్మను ఘనంగా సన్మానించారు. చిన్నారులు వేసిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంఈఓ శివనాగేశ్వర రావు, ప్రేమ్ కుమార్, అరుణ్ కుమార్, రాజకుమార్, ఫాదర్లు మర్రెడ్డి, భరత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి

విశాలాంధ్ర-మంగళగిరి : ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని మంగళగిరి గ్రామీణ ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్ హెచ్చరించారు. ఆదివారం మంగళగిరి మండలం కాజా టోల్ ప్లాజా వద్ద వాహనాలు తనిఖీ చేయగా నిబంధనలను ఉల్లంఘించిన వారిపై జరిమానా విధించారు. వాహనదారులు ప్రతి ఒక్కరూ విధిగా హెల్మెట్ ధరించాలని ఆయన హెచ్చరించారు. ఇతర వాహనాలను నడిపేవారు తప్పనిసరిగా సీట్ బెల్ట్ ధరించాలని ఆయన అన్నారు. అతివేగంగా ప్రమాదకరమని, వాహనాలను అతివేగంగా నడపకూడదని ఆయన సూచించారు. అలాగే సెల్ఫోన్ డ్రైవింగ్ త్రిబుల్ రైడింగ్ చేయరాదని, మద్యం సేవించి వాహనాలను నడపరాదని అలా చేసిన యెడల చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోబడతాయని ఎస్ఐ వెంకట్ వాహనదారులను హెచ్చరించారు.